పక్కా తెలుగు

ప్రభాత
# కిరణమ్
సత్యానికి వారధి

PRGI REGD No.: TGTEL/26/A4986

5 DOTS NETWORK

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 01 | సంచిక : 009 | శుక్రవారం | 03-07-2026 | పేజీలు : 08 | వెల: రూ.4/- www.prabhathakiranam.com

Medchal Malkajigiri | Volume : 01 | Issue : 009 | Friday | 03-07-2026 | Pages: 08 | Price : Rs.4/- Circulated to Telangana | Published from Medchal Malkajgiri


## పొలిటికల్ రణరంగం

◆ తెలంగాణలో సవాళ్ల పర్వం
◆ ముదిరిన మాటల యుద్ధం

రాష్ట్ర రాజకీయాల్లో ఊహించని ఉద్రిక్త పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లతో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. కాంగ్రెస్ పార్టీ సాగిస్తున్న రెండున్నరేళ్ల చెత్త పాలనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. ప్రభుత్వ అవినీతి, అక్రమాలను లెక్కలతో సహా పక్కాగా నిరూపిస్తానని ఆయన స్పష్టం చేశారు. వరంగల్ ప్రెస్‌క్లబ్, అశోక్‌నగర్ లేదా అసెంబ్లీ.. వేదిక ఏదైనా చర్చకు తాను సిద్ధమని, కాంగ్రెస్ తరపున రాహుల్‌గాంధీ వస్తారో లేక ఇంకెవరైనా వస్తారో తేల్చుకోవాలని కేటీఆర్ సవాల్ విసిరారు. పాలనా వైఫల్యాలను నిరూపించకపోతే రాజకీయాల నుండి శాశ్వతంగా తప్పుకుంటానని ప్రకటించారు.

**• జూపల్లి కౌంటర్.. తెలంగాణ భవన్ వద్ద భారీ బందోబస్తు**

కేటీఆర్ విసిరిన సవాల్‌కు మంత్రి జూపల్లి కృష్ణారావు గట్టిగా స్పందించారు. తాను గురువారం ఉదయం 11 గంటలకు బీఆర్ఎస్ ప్రధాన కార్యాలయమైన తెలంగాణ భవన్‌కు వస్తానని ప్రతిసవాల్ చేశారు. ఈ చాలెంజ్‌ను స్వీకరించిన బీఆర్ఎస్ శ్రేణులు.. మంత్రి కోసం ప్రత్యేకంగా కుర్చీ సిద్ధం చేశామని, దమ్ముంటే చర్చకు రావాలని పేర్కొన్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో అటు తెలంగాణ భవన్, ఇటు కాంగ్రెస్ కార్యాలయమైన గాంధీ భవన్ వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జూపల్లి వస్తే ఆర్‌బీఐ లెక్కలు, కేంద్ర ప్రభుత్వ నివేదికల సాక్ష్యాలతో తిప్పికొడతామని కేటీఆర్, హరీశ్ రావు వ్యూహాలు సిద్ధం చేసుకున్నారు. జూపల్లితో చర్చకు కేటీఆర్ అవసరం లేదని, తాను ఒక్కడినే సరిపోతానని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ వ్యాఖ్యానించారు.



సవాళ్లతో హంగామా..
రక్తికట్టించిన
పొలిటికల్ డ్రామా


తెలంగాణ
# పొలిటికల్ వార్

తెలంగాణ పొలిటికల్ స్క్రీన్‌పై అప్పడే హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్ మొదలైపోయింది! ఎన్నికలకు ఇంకా రెండున్నరేళ్ల సుదీర్ఘ సమయం ఉన్నప్పటికీ.. ప్రధాన పార్టీల మధ్య సాగుతున్న సవాళ్లు, ప్రతిసవాళ్లు చూస్తుంటే రాష్ట్రంలో పొలిటికల్ క్లైమాక్స్ ఇప్పుడే వచ్చేసిందా అనే రేంజ్‌లో హీట్ ఎలివేట్ అవుతోంది. పాలన, అభివృద్ధి కంటే.. ఒకరినొకరు పొలిటికల్‌గా దెబ్బకొట్టుకోవడమే ఏకైక అజెండాగా సాగుతున్న ఈ మైండ్ గేమ్‌లో లీడర్లు విసురుతున్న డైలాగులు బాక్సులు బద్దలయ్యేలా చేస్తున్నాయి. ఒకవైపు "దమ్ముంటే చర్చకు రండి.. లెక్కలు తేల్చకపోతే రాజకీయాల నుంచి తప్పకుంటా" అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విసిరిన ఆటంబాంబ్ లాంటి సవాల్.. దానికి ప్రతిగా "తెలంగాణ భవన్‌కు వస్తున్నా.. కుర్చీ సిద్ధం చేసుకోండి" అంటూ మంత్రి జూపల్లి కృష్ణారావు చేసిన కౌంటర్ ఎటాక్ రాష్ట్ర రాజకీయాలను రణరంగంగా మార్చేశాయి. గాంధీ భవన్, తెలంగాణ భవన్ చుట్టూ పోలీస్ బందోబస్తులు, రోజుకో పొలిటికల్ చాలెంజ్‌లతో వాతావరణం మునుపెన్నడూ లేనంతగా వేడెక్కింది. ఇదంతా ఒకెత్తయితే.. వచ్చే డిసెంబర్ నుంచి 'ఉత్తర తెలంగాణ' వేదికగా విపక్షాల కోటలను బద్దలు కొట్టేందుకు సీఎం రేవంత్ రెడ్డి పక్కా పొలిటికల్ స్కెచ్‌తో గ్రౌండ్‌లోకి దిగుతున్నారు. బస్సు యాత్రలు, పాదయాత్రలతో బీజేపీ, బీఆర్ఎస్‌లపై ముకుమ్మడి దాడికి కాంగ్రెస్ వ్యూహాలు సిద్ధం చేస్తోంది. ముందస్తుగానే ఎలక్షన్ మూడ్‌ను తలపిస్తూ.. హీట్ పెంచుతున్న తెలంగాణ లేటెస్ట్ పొలిటికల్ వార్‌పై ప్రత్యేక కథనం..!!

## చర్చలకు భయపడి కాంగ్రెస్ పలాయనం!

### కాంగ్రెస్ పారిపోయిందన్న హరీశ్ రావు

బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పులపై చర్చకు రమ్మని పిలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఆ పార్టీ మంత్రులు ఇప్పుడు తోక ముడిచి పారిపోయారని మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. (వివరాలు 3లో..)



## బీఆర్ఎస్ బ్లాక్‌మెయిల్‌కు లొంగం

### గూండాగిరితో ఏం చేయలేరన్న పొంగులేటి



రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న గూండాగిరి రాజకీయాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతమాత్రం భయపడేది లేదని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గత పదేళ్ల కాలంలో కోట్లాది రూపాయల ప్రజల సొమ్మును కొల్లగొట్టిన బీఆర్ఎస్ నాయకులు.. తాము ఇంకా అధికారంలోనే ఉన్నామనే భ్రమలో బతుకుతున్నారని మండిపడ్డారు. (వివరాలు 3లో..)

## సవాళ్ల పర్వం..
## హరీశ్ రావు అరెస్ట్!



వివరాలు3లో..



◆ గన్‌పార్క్ వద్ద కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్
◆ చర్చకు సిద్ధమంటూ మంత్రుల సంచలన ప్రకటన

రాష్ట్రంలో గురుకులాల నిర్వహణ, అవినీతి ఆరోపణల అంశంపై రాజకీయ వేడి ఒక్కసారిగా పెరిగింది. ఈ నేపథ్యంలో అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మహ్మద్ అజారుద్దీన్ బహిరంగ చర్చకు సిద్ధమయ్యారు. ప్రతిపక్ష బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పలు వివాదాస్పద అంశాలపై ముఖాముఖి చర్చించడానికి తాము రెడీ అని ప్రకటించారు. ఇందులో భాగంగానే కాంగ్రెస్ మంత్రులు మొదటగా అసెంబ్లీకి బయలుదేరారు. ఆ తర్వాత గన్‌పార్క్‌కు చేరుకుని తాము చర్చకు సిద్ధంగా ఉన్నామంటూ అక్కడ బైఠాయించారు. గురుకులాల వ్యవహారంలో తమ ప్రభుత్వం పూర్తిగా పారదర్శకంగా వ్యవహరిస్తోందని, ఎలాంటి ఆరోపణలపైనైనా సమాధానం చెప్తామని మంత్రులు స్పష్టం చేశారు.

**• ముందుకు వచ్చిన కాంగ్రెస్ నేతలు**

కాంగ్రెస్ మంత్రులకు దమ్ము, ధైర్యం ఉన్నాయి కాబట్టే వారు ఇలా బహిరంగ చర్చకు ముందుకు వచ్చారని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్ గన్‌పార్క్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. తమ వైపు ఎలాంటి తప్పు లేదనే నమ్మకంతోనే మంత్రులు నేరుగా ప్రజల ముందుకు వచ్చి నిలబడ్డారని చెప్పారు. ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాలు చేసే ఎలాంటి విమర్శలనైనా ధీటుగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. గురుకులాల టెండర్లపై వచ్చిన ఆరోపణలకు తగిన సమాధానం చెప్పేందుకే మంత్రులు ఇక్కడికి వచ్చారని గుర్తుచేశారు.

## గురుకులాల సవాల్

◆ నిజాలు తేల్చేందుకు సిద్ధమైన యంత్రాంగం
◆ అవినీతి ఆరోపణలపై మంత్రి పొన్నం దూకుడు



గురుకులాల టెండర్లలో అవినీతి జరిగిందంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలపై చర్చించేందుకు తాము బరాబర్ సిద్ధమని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ విసిరిన సవాల్‌ను స్వీకరిస్తూ మంత్రులు గురువారం హైదరాబాద్‌లోని గన్‌పార్క్ అమరవీరుల స్థూపం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య (3లో..)

## వైఫల్యాలతో కాంగ్రెస్ పారిపోతోంది

### హస్తం నేతల సవాళ్లపై కేటీఆర్ విమర్శలు



అసత్యాలతో ప్రజలను మభ్యపెట్టే కార్యక్రమాలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. ప్రతిపక్షాలు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం ఇచ్చే తెగువ ప్రస్తుత సర్కార్‌కి లేదని ఎద్దేవా చేశారు. గతంలో అప్పుల విషయంలో దమ్ముంటే రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సవాల్ చేశారని.. తీరా తాము ప్రెస్‌క్లబ్‌కి వెళ్తే ఎందుకు రాలేదని ప్రశ్నించారు.

## అప్పుల బాగోతం చెప్తా.. జూపల్లి సవాల్!

### గత ప్రభుత్వ ఆర్థిక విధ్వంసమన్న మంత్రి



బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుల వివరాలపై తాము ఎప్పుడైనా చర్చకు సిద్ధంగా ఉన్నామని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. గత గులాబీ ప్రభుత్వం రాష్ట్రానికి ఏకంగా రూ.7.3 లక్షల కోట్ల అప్పులు మిగిల్చిందని ఆయన ఆరోపించారు. కేవలం కాళేశ్వరం ప్రాజెక్టు పేరు చెప్పి రూ.74 వేల కోట్ల అప్పులు తెచ్చారని మండిపడ్డారు. తాను చేసిన ఈ వ్యాఖ్యలకు పూర్తిగా కట్టుబడి ఉన్నానని.. ఒకవేళ తాను చెప్పిన లెక్కలు అబద్ధమైతే తన మంత్రి పదవికి రాజీనామా చేయడానికి సిద్ధమని (3లో..)

## పొలిటికల్ కలర్స్

◆ బిగ్‌బాస్ షోలా రెండు పార్టీల తీరు
◆ కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై బండి ఫైర్



కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య సాగుతున్న సవాళ్లు, ప్రతిసవాళ్లపై కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ రెండు పార్టీల డ్రామాలు ప్రసిద్ధ టీవీ రియాలిటీ షో 'బిగ్‌బాస్'ను తలపిస్తున్నాయని ఆయన ఎద్దేవా చేశారు. కెమెరాల ముందేమో కొట్టుకుంటూ.. అసలు సమయం వచ్చేసరికి ఒకరినొకరు కాపాడుకోవడం ఈ పార్టీలకు అలవాటుగా మారిందని విమర్శించారు. ఇదంతా ముందే రాసుకున్న స్క్రిప్ట్ ప్రకారం జరుగుతున్న నాటకమని ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా దుయ్యబట్టారు.
(వివరాలు 3లో..)

## అధికార గర్వంతో పేదలపై దాడులా?

### హైడ్రా తీరుపై నిప్పులు చెరిగిన హైకోర్టు

చెరువుల రక్షణ పేరుతో పుట్టుకొచ్చిన హైడ్రా, జీహెచ్ఎంసీ వ్యవస్థలు కేవలం పేద ప్రజల ఇళ్లను మాత్రమే లక్ష్యంగా చేసుకుని కూలుస్తున్నాయంటూ తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తార్నాకలోని ఎర్రకుంట చెరువు ఆక్రమణలపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం.. అధికారుల తీరును తీవ్రంగా తప్పుపట్టింది. చట్టం అంటే కేవలం పేదవాడిని భయపెట్టేది మాత్రమే కాదని, పెద్దల అక్రమాలను వదిలేసి సామాన్యుల ఇళ్లను టార్గెట్ చేయడం అన్యాయమని హెచ్చరించింది. (2లో..)





## ఆలయ మంటలు

◆ యాదాద్రి టెంపుల్ బోర్డు రగడ
◆ కేబినెట్ భేటీకి మంత్రి గైర్హాజరు
◆ చర్చనీయాంశమైన సురేఖ అలక
◆ నిన్న రాజగోపాల్ రెడ్డి, నేడు మంత్రి

కేబినెట్ సమావేశానికి రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గైర్హాజరు కావడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రి అధ్యక్షతన గురువారం జరిగిన మంత్రిమండలి సమావేశానికి ఆమె రాకపోవడంపై సచివాలయ వర్గాలతో పాటు రాజకీయంగానూ పలు ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. (2లో..)




## అయోధ్యలో పేలిన రాంబాంబ్

◆ దేశమంతటా సౌండ్ చేస్తోన్న ఆటంబాంబ్
◆ రామ మందిర విరాళాల చోరీ వివాదం
◆ లాయర్ల నిరసన.. ట్రస్టీలపై కేసులకు డిమాండ్
◆ అయోధ్యలో ముమ్మరమైన విచారణ ప్రక్రియ
◆ ప్రధాని మోదీకి కాంగ్రెస్ నేత కేసీ లేఖాస్త్రం
◆ బాక్సులు బద్దలయ్యేలా పొలిటికల్ వార్!

అయోధ్య సాక్షిగా దేశాన్ని కుదిపేసే మహా కుంభకోణం బద్దలైంది! కోట్లాది మంది హిందువుల ఆరాధ్య దైవమైన శ్రీరాముడి మందిర విరాళాల లూటీ ఉదంతం ఇప్పుడు దేశవ్యాప్తంగా దావానలంలా మండుతోంది. ఒకవైపు ప్రత్యేక దర్యాప్తు బృందాలు, పోలీసులు ఆలయ కౌంటింగ్ గదులను జల్లెడ పడుతుంటే... మరోవైపు నిందితుల ఇళ్లపై బుల్డోజర్లు నడిపేందుకు యంత్రాంగం సిద్ధమైంది. 500 మందికి పైగా లాయర్లు రోడ్లపైకి వచ్చి ట్రస్టీల అరెస్టుకు డిమాండ్ చేయడంతో అయోధ్య వీధులు రణరంగంగా మారాయి. ఈ చందా చోరీ వ్యవహారం కేవలం కొందరు ఉద్యోగుల పనేనా? లేక వెనుక పెద్ద తిమింగలాలు ఉన్నాయా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ నేరుగా ప్రధాని మోదీకే లేఖ రాస్తూ.. ఇది కోట్లాది మంది నమ్మకంపై జరిగిన "మహా ద్రోహం" అని మండిపడ్డారు. యోగి సర్కార్ వేసిన సిట్ విచారణ అంతా కంటితుడుపు చర్యేనని, సుప్రీంకోర్టు పర్యవేక్షణలోనే దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు. ట్రస్ట్ సభ్యుల అంతర్గత పోరు, వరుస రాజీనామాలతో వేడెక్కిన ఈ 'రాంబాంబ్' కుంభకోణంపై స్పెషల్ ఫోకస్..!!

# సెక్యూరిటీ మ్యాటర్స్

- బుల్లెట్ ప్రూఫ్ వాహనాల ఉపసంహరణ
- మాజీల భద్రతపై కీలక ఉత్తర్వులు
- పలువురు లీడర్లకు గన్‌మెన్ల కుదింపు

తెలంగాణ పోలీస్ శాఖ ఒక అత్యంత కీలకమైన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో పనిచేసిన మాజీ డీజీపీలతో పాటు ప్రస్తుతం వివిధ కీలక బాధ్యతల్లో ఉన్న పోలీస్ ఉన్నతాధికారులకు బుల్లెట్ ప్రూఫ్ వాహనాలను తొలగిస్తూ గురువారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కొత్త నిర్ణయం ప్రకారం సుమారు 20 మంది మాజీ పోలీస్



ఉన్నతాధికారులు, ప్రస్తుత అధికారుల వద్ద ఉన్న రక్షణ వాహనాలను తక్షణమే తీసివేయనున్నారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్లకు కేటాయించిన ప్రత్యేక బుల్లెట్ ప్రూఫ్ వాహనాలను సైతం వెనక్కి తీసుకోవాలని ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

**మాజీ డీజీపీల జాబితా విడుదల**

ఈ నిర్ణయం వర్తించే ప్రముఖ అధికారుల జాబితాను పోలీస్ శాఖ ప్రకటించింది. మాజీ డీజీపీలు స్వరజిత్ సేన్, ఏకే ఖాన్, ఏకే మహంతి, దినేష్ రెడ్డి, జితేందర్, మహేందర్ రెడ్డి, అనురాగ్ శర్మ, పూర్ణచందర్రావు, కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి, నవీన్ ఛంద్, డానియల్, వెంకట్రామిరెడ్డి, స్టీఫెన్ రవీంద్ర, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, డీటి నాయక్, ఉమేష్ షరీఫ్, రవి గుప్తా సహా ఇంటెలిజెన్స్ చీఫ్ విజయకుమార్ లాంటి కీలక అధికారుల వాహనాలను తొలగించారు. మాజీ అధికారులకు కేటాయించిన ఎస్కార్ట్ వాహనాల రక్షణను కూడా పోలీస్ శాఖ పూర్తిగా రద్దు చేసింది.

**గన్ మెన్ల సంఖ్య భారీగా తగ్గింపు**

వాహనాలతో పాటు పలువురు రాజకీయ నాయకులకు, పోలీస్ అధికారులకు ఉన్న వ్యక్తిగత భద్రతా సిబ్బంది (గన్ మెన్ల) సంఖ్యను కూడా భారీగా తగ్గించారు. చాలా మందికి భద్రతను కేవలం వన్ ప్లస్ వన్ గన్ మెన్లకే పరిమితం చేస్తూ నిర్ణయించారు. రాష్ట్రంలో నక్సల్స్ ప్రభావం ఇప్పుడు పూర్తిగా తగ్గిపోవడంతోనే ఈ కఠినమైన నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ చర్యల వల్ల ప్రభుత్వానికి ప్రతి ఏటా కోట్లాది రూపాయల ప్రజాధనం ఆదా కానుంది.

# వీబీజీ రామ్ జీ చట్టంపై అసంతృప్తి



- కేంద్రం ఏకపక్ష నిర్ణయమన్న కేబినెట్
- మూసీ ప్రక్షాళనకు రూ.7,345 కోట్లు
- బడి పిల్లలతో పాటు సిబ్బందికీ భోజనం
- కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వీబీజీ రామ్ జీ చట్టంపై రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సుదీర్ఘ చర్చ జరిగింది. రాష్ట్రాలను సంప్రదించకుండా ఏకపక్షంగా నిబంధనలు మార్చడంపై కేబినెట్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఉపాధి హామీ పథకంలో మార్పులు చేయవద్దంటూ గత జనవరిలోనే అసెంబ్లీ తీర్మానం పంపిన విషయాన్ని గుర్తు చేసుకుంది. కేంద్ర నిర్ణయం ఫెడరల్ స్ఫూర్తికి, రాజ్యాంగ నియమాలకు విరుద్ధంగా ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలోని కేబినెట్ సబ్ కమిటీ నివేదించింది. అయితే కూలీలకు ఉపాధి కల్పించాలనే ప్రధాన ఉద్దేశంతో, గత్యంతరం లేని పరిస్థితుల్లో ఈ కొత్త చట్టాన్ని 2026 జులై 1 నుంచి రాష్ట్రంలో అమలు చేయడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ నిబంధనలపై సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేయాలని, పార్లమెంట్ లోనూ కేంద్రాన్ని నిలదీయాలని ప్రభుత్వం గట్టిగా నిర్ణయించింది.

**బడి పిల్లలతో పాటు సిబ్బందికీ భోజనం**

పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు అందించే అల్పాహారం, పాలు, మధ్యాహ్న భోజన పథకంలో కేబినెట్ ఒక చారిత్రాత్మక మార్పు తీసుకువచ్చింది. ఇకపై విద్యార్థులతో పాటు అక్కడ పనిచేసే ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ఇతర సిబ్బందికి కూడా ఈ ఉచిత భోజన సదుపాయం కల్పించనున్నారు. నాణ్యమైన పోషకాహారాన్ని పర్యవేక్షించడంలో జవాబుదారీతనం పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా దాదాపు లక్షన్నర మంది సిబ్బందికి ప్రయోజనం చేకూరనుంది.

**వైద్య రంగంలో భారీ ఉద్యోగాల విప్లవం**

కొత్తగా అందుబాటులోకి వస్తున్న టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. సనత్ నగర్, ఎల్.బి.నగర్, అల్వాల్, వరంగల్ ఆసుపత్రుల్లో డాక్టర్లు, వైద్య సిబ్బంది నియామకానికి కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మొత్తం 6,278 పోస్టుల మంజూరుకు ఆమోదం లభించింది. ఇందులో 1,494 రెగ్యులర్ పోస్టులు, 549 కాంట్రాక్ట్ పోస్టులు, 4,235 ఔట్ సోర్సింగ్ పోస్టులు ఉన్నాయి. ఈ ఆసుపత్రులను నిమ్స్ తరహాలో అభివృద్ధి చేయాలని, ఇక్కడ వైద్యం చేయించుకునే రోగులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఎల్ఓసీలు కూడా మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

**మూసీ ప్రక్షాళనకు రూ.7,345 కోట్లు**

హైదరాబాద్ నగర ముఖచిత్రాన్ని మార్చే మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ లో భాగంగా ఫేజ్ 1 పనులకు మంత్రివర్గం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. తొలి దశలో 21 కిలోమీటర్ల పొడవునా నదిని అభివృద్ధి చేయడానికి రూ.7,345.12 కోట్ల నిధులు కేటాయించింది. హిమాయత్ సాగర్ నుంచి ఈసా, ఉస్మాన్ సాగర్ నుంచి మూసా ప్రవాహాలు ప్రారంభమయ్యే ప్రాంతం నుంచి బాపూఘాట్ వరకు ఈ పనులు జరగనున్నాయి. ఈ ప్రాజెక్టు నిర్వహణ కోసం ప్రత్యేకంగా 147 కొత్త పోస్టుల ఏర్పాటుతో పాటు ఇతర శాఖల నుంచి సిబ్బందిని డిప్యుటేషన్‌పై నియమించడానికి కేబినెట్ ఆమోదం తెలిపింది.

**గిడ్డంగులు, పాఠశాలలకు భూముల కేటాయింపు**

రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పనకు వీలుగా పలు చోట్ల ప్రభుత్వ భూములను కేటాయిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. వరంగల్ జిల్లా బొల్లికుంట గ్రామంలో 50 ఎకరాలు, రంగారెడ్డి జిల్లా కర్మాలపహాడ్ గ్రామంలో 10 ఎకరాల భూమిని నిత్యావసర వస్తువుల గోదాముల నిర్మాణం కోసం తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థకు మార్కెట్ ధర ప్రకారం కేటాయించారు. అలాగే విద్యా రంగానికి ప్రాధాన్యత ఇస్తూ మహబూబ్‌నగర్ జిల్లా పెద్దాయిపల్లిలో 20.18 ఎకరాలు, సూర్యాపేట జిల్లా కోదాడలో 19.12 ఎకరాల భూమిని జవహర్ నవోదయ విద్యాలయాల కోసం కేటాయించారు. జగిత్యాల జిల్లా చల్‌గల్ గ్రామంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు కొరకు మరో 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయిస్తూ మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది.

# బ్లాక్, వైట్ చేసేస్తామంటారు



- నకిలీ పోలీసుల భారీ దోపిడీ
- కేసును ఛేదించిన పోలీసులు

బ్లాక్‌మనీని వైట్‌గా మారుస్తామని అమాయకులకు ఆశ చూపించి.. ఆపై పోలీసుల వేషంలో బెదిరించి నగదు దోచుకున్న అంతరాష్ట్ర ముఠాను సత్తుపల్లి పోలీసులు విజయవంతంగా అరెస్ట్ చేశారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని గంగారంలో జరిగిన సంచలన డెకాయిటీ కేసును ప్రత్యేక బృందాలు ఛేదించాయి. కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ ఆధ్వర్యంలో ముమ్మర దర్యాప్తు జరిపి మొత్తం 12 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులే ఈ దోపిడీ ముఠాలో కీలక భాగస్వాములు కావడం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది. అరెస్టయిన వారిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించగా.. ఈ కేసులో ప్రమేయం ఉన్న మరో ఇద్దరు నిందితులు ప్రస్తుతం పరారీలో ఉన్నారు. సత్తుపల్లి పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ వసుంధర యాదవ్ కేసు వివరాలను వెల్లడించారు.

**కడప బాధితుడి ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చిన మోసం**

గత నెల 25న కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన కుర్రా గంగాధర్‌రెడ్డి సత్తుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా పట్టణ సీఐ టి. శ్రీహరి కేసు నమోదు చేసి ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టారు. గంగారం శివారులో నిర్వహించిన వాహన తనిఖీల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న 12 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా అసలు దారుణం వెలుగుచూసింది. ఏలూరు జిల్లా వెంకటాపురానికి చెందిన ఈద చంటిబాబు ఈ ముఠాకు ప్రధాన సూత్రధారిగా వ్యవహరించాడు. నిందితులు వివిధ సిమ్‌కార్డుల ద్వారా అమాయకులకు ఫోన్ చేసి, తాము రియల్ ఎస్టేట్ వ్యాపారులమని.. తమ వద్ద ఉన్న బ్లాక్‌మనీని వైట్ మనీగా మార్చుకోవాల్సి ఉందని నమ్మించేవారు.

**డమ్మీ నోట్లతో దాడి.. పోలీసుల అసలు రంగు**


రూ. 10 లక్షల అసలు నగదు ఇస్తే రూ. 40 లక్షల వైట్ మనీ మీ ఖాతాలో జమ చేస్తామని ఆశ చూపించి బాధితులను నిర్ణయించిన ప్రాంతానికి రప్పించేవారు. బాధితులు నగదు తీసుకొచ్చిన తర్వాత డమ్మీ కరెన్సీ నింపిన బ్యాగును వారికి ఇచ్చేవారు. అదే సమయంలో ముందస్తు ప్రణాళిక ప్రకారం ముఠాలోని కొందరు నిజమైన పోలీసులతో పాటు మరికొందరు నకిలీ పోలీసుల వేషంలో అక్కడికి చేరుకుని దాడి చేసేవారు. నకిలీ కరెన్సీ వ్యాపారం చేస్తున్నారంటూ బెదిరించి బాధితుల వద్ద ఉన్న అసలు నగదును లాక్కొని పరారయ్యేవారు. ఈ కేసులో టీజీఎస్పీ 15వ బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుల్ ముళ్లగిరి వర్ధన్, ఆర్ఎస్ఐ బైరా కేశవరావు ప్రమేయం ఉన్నట్లు ఏసీపీ నిర్ధారించారు.

**భారీగా సొత్తు స్వాధీనం.. ప్రజలకు పోలీసుల హెచ్చరిక**

నిందితుల వద్ద నుంచి రూ. 17.60 లక్షల నగదు, మూడు కార్లు, ఒక స్కూటీ, సెల్ ఫోన్లు, పోలీసు దుస్తులు, బేడీలు, డమ్మీ కరెన్సీ నోట్ల బండిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ వెల్లడించారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితులను త్వరలోనే అరెస్ట్ చేస్తామన్నారు. కేసును వేగంగా ఛేదించిన పోలీసు బృందాన్ని ఏసీపీ అభినందించి రివార్డులు అందజేశారు. ప్రజలు బ్లాక్‌మనీ మార్పిడి పేరుతో వచ్చే ఫోన్‌కాల్స్, తక్కువ డబ్బుకు ఎక్కువ లాభాలు ఇస్తామనే ఆఫర్లను నమ్మవద్దని సూచించారు. ఇలాంటి అనుమానాస్పద సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఏసీపీ వసుంధర యాదవ్ కోరారు.

# ఆలయ మంటలు

- యాదాద్రి టెంపుల్ బోర్డు రగడ
- కేబినెట్ భేటీకి మంత్రి గైర్హాజరు
- చర్చనీయాంశమైన సురేఖ అలక
- నిన్న రాజగోపాల్ రెడ్డి, నేడు మంత్రి



కేబినెట్ సమావేశానికి రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గైర్హాజరు కావడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రి అధ్యక్షతన గురువారం జరిగిన మంత్రిమండలి సమావేశానికి ఆమె రాకపోవడంపై సచివాలయ వర్గాలతో పాటు రాజకీయంగానూ పలు ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. సురేఖ తన విదేశీ పర్యటన ముగించుకుని రాష్ట్రానికి తిరిగి వచ్చినప్పటికీ, గురువారం జరిగిన కేబినెట్ భేటీకి రాకపోవడం వెనుక బలమైన కారణాలే ఉండి ఉంటాయని అంతా భావిస్తున్నారు.

**యాదగిరిగుట్ట బోర్డు ఏర్పాటుపై తీవ్ర అసంతృప్తి**

ప్రధానంగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ బోర్డు ఏర్పాటు ప్రక్రియకు సంబంధించిన వ్యవహారమే మంత్రి కొండా సురేఖ అసంతృప్తికి కారణమనే ప్రచారం జోరుగా సాగుతోంది. తన శాఖకు సంబంధించిన అత్యంత కీలకమైన ఈ బోర్డు ఏర్పాటు విషయంలో దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్న తన అభిప్రాయాలను పూర్తిగా పరిగణనలోకి తీసుకోలేదనే భావనతో ఆమె ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయంలో తీవ్ర అలక పూనిన కారణంగానే కొండా సురేఖ ఉద్దేశపూర్వకంగానే ఇవాళ్టి కేబినెట్ సమావేశానికి దూరంగా ఉన్నారని సచివాలయ వర్గాల్లో గట్టిగా చర్చ నడుస్తోంది. ఇప్పటికే ప్రభుత్వ తీరుపై కాంగ్రెస్ సీనియర్ నేత, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలకు ఇచ్చే గౌరవం ఇదేనా అంటూ ఆయన ప్రశ్నించారు. తాజాగా సాక్షాత్తూ దేవాదాయ శాఖ మంత్రి, నిరసనతో ఈ వ్యవహారం వచ్చే రోజుల్లో ఎలాంటి మలుపు తీసుకుంటుందోనన్న అభిప్రాయం నెలకొంది.

# బీఆర్ఎస్ బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు లొంగం

**గూండాగిరితో ఏం చేయలేరన్న పొంగులేటి**




రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న గూండాగిరి రాజకీయాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతమాత్రం భయపడేది లేదని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గత పదేళ్ల కాలంలో కోట్లాది రూపాయల ప్రజల సొమ్మును కొల్లగొట్టిన బీఆర్ఎస్ నాయకులు.. తాము ఇంకా అధికారంలోనే ఉన్నామనే భ్రమలో బతుకుతున్నారని మండిపడ్డారు. వారి అవినీతి అక్రమాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు అసెంబ్లీ సాక్షిగా ఆధారాలతో బయటపెట్టారని గుర్తుచేశారు. అయినా సరే బుద్ధి మార్చుకోకుండా ప్రతిపక్ష నేతలు పగటి కలలు కంటూ ప్రభుత్వంపై బురద జల్లడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు.

**• ప్రభుత్వంపై బురద జల్లేందుకు కుట్రలు**

గత పదేళ్ల పాలనలో తాము అంటించుకున్న బురదను ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదా మంత్రులకు అంటించాలని బీఆర్ఎస్ నేతలు చూస్తున్నారని పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. రాష్ట్రాన్ని ఐదేళ్ల పాటు పాలించమని ప్రజలు కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన అధికారమిచ్చారని చెప్పారు. అలాంటిది ప్రతిపక్షాలు మతిభ్రమించి రెండున్నరేళ్లకే గద్దె దిగాలని డిమాండ్ చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ కొద్ది కాలంలోనే రాష్ట్రంలో ఏం జరిగిందో, ఎలాంటి ప్రజా తీర్పులు వచ్చాయో రాష్ట్ర ప్రజలకే కాకుండా దేశం మొత్తానికి బాగా తెలుసని వ్యాఖ్యానించారు.

**• బాధ్యతారాహిత్యంగా ప్రతిపక్షాల టెండర్ల ఆరోపణలు**

ప్రభుత్వంలోని ఏ శాఖలోనైనా పిలిచిన టెండర్ మొత్తం కంటే మూడు నాలుగు రెట్లు అవినీతి జరిగిందని ఆరోపించడం బీఆర్ఎస్ నేతల అవివేకానికి నిదర్శనమని మంత్రి దుయ్యబట్టారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి నిజాలు లేకుండా కేవలం బురద చల్లడమే లక్ష్యంగా పెట్టుకున్నారని మండిపడ్డారు. ప్రతిపక్షాల ప్రవర్తన భవిష్యత్తులో కూడా ఇలాగే కొనసాగితే రానున్న కాలంలో వారికి కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా పోతుందని హెచ్చరించారు. ప్రజలు వారి డ్రామాలను గమనిస్తున్నారని, త్వరలోనే తగిన బుద్ధి చెబుతారని అన్నారు.

**• సవాల్ స్వీకరిస్తే విపక్ష నేతలే పరార్**

బీఆర్ఎస్ విసిరిన సవాల్‌ను స్వీకరించి తమ మంత్రులు గన్‌పార్క్ వద్దకు వెళ్తే.. ప్రతిపక్ష నేతలే భయపడి రాకుండా పారిపోయారని పొంగులేటి ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ మంత్రులు అక్కడ గంట వరకు వేచి చూసి, మీడియాతో మాట్లాడి వచ్చారని గుర్తుచేశారు. అసెంబ్లీలో కూడా ప్రతిపక్షాలు ఏం మాట్లాడతాయో తమకు ముందే తెలుసని, దానికి కూడా త్వరలోనే తేదీని ఖరారు చేస్తామని చెప్పారు. ఎక్కడైనా, ఎప్పుడైనా చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, బీఆర్ఎస్ నేతలే తోక ముడిచారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.



# పేదల సొంత ఇంటి కల నిజం!

» ఇందిరమ్మ ఇళ్లకు త్వరలో టెండర్లు
» పైలట్ ప్రాజెక్ట్‌గా నిర్మాణాలు

క్యూర్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి త్వరలోనే టెండర్లు పిలవనున్నట్లు రాష్ట్ర హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఇందుకు సంబంధించిన స్థల సేకరణ రెండు మూడు రోజుల్లో పూర్తి కానుందన్నారు. గోషామహల్ పరిధిలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలను మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్‌లతో కలిసి ఆయన లబ్ధిదారులకు అందజేశారు. క్యూర్ పరిధిలోని 19 నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్ట్ కింద ఒక్కో చోట 500 నుండి వెయ్యి ఇళ్ల నిర్మాణం చేపడతామన్నారు. పేదలను నగరానికి దూరంగా తరలించకుండా, వారి జీవనాధార ప్రాంతాలకే దగ్గరగా ఇళ్లు నిర్మించి ఇస్తామని మంత్రి స్పష్టం చేశారు. పట్టణ ప్రాంతాల్లో భూమి విలువ ఎంత ఎక్కువగా ఉన్నా లెక్కచేయకుండా పేదలకు గూడు కల్పిస్తామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం భారీ ప్రాజెక్టుల పేరిట అవినీతికి పాల్పడిందని ఆరోపించిన ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని తెలిపారు. రెండున్నరేళ్లలో రికార్డు స్థాయిలో ఇళ్లు నిర్మించి గుడిసెల్లేని తెలంగాణను సాకారం చేస్తామని పొంగులేటి భరోసా ఇచ్చారు.

# అధికార గర్వంతో పేదలపై దాడులా?

- హైడ్రా తీరుపై నిప్పులు చెరిగిన హైకోర్టు

చెరువుల రక్షణ పేరుతో పుట్టుకొచ్చిన హైడ్రా, జీహెచ్ఎంసీ వ్యవస్థలు కేవలం పేద ప్రజల ఇళ్లను మాత్రమే లక్ష్యంగా చేసుకుని కూలుస్తున్నాయంటూ తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తార్నాకలోని ఎర్రకుంట చెరువు ఆక్రమణలపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం.. అధికారుల తీరును తీవ్రంగా తప్పుపట్టింది. చట్టం అంటే కేవలం పేదవాడిని భయపెట్టేది మాత్రమే కాదని, పెద్దల అక్రమాలను వదిలేసి సామాన్యుల ఇళ్లను టార్గెట్ చేయడం అన్యాయమని హెచ్చరించింది.

**ధనవంతుల ఆక్రమణలపై అధికారుల గుడ్డి నిద్ర**

8 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఎర్రకుంట చెరువు క్రమక్రమంగా పెద్దల చేతుల్లో ఆక్రమణలకు గురవుతున్నా అధికారులు కళ్లు మూసుకున్నారని పిటిషనర్ కోర్టుకు వివరించారు. జీహెచ్ఎంసీ, హైడ్రా, లేక్ ప్రొటెక్షన్ కమిటీలకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా కనీసం పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. అసలైన ఆక్రమణలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో చెప్పాలని ప్రశ్నిస్తూ జీహెచ్ఎంసీ, హైడ్రా, నీటి పారుదల శాఖలకు హైకోర్టు ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. ఈ కేసు తదుపరి విచారణను ఈనెల 16వ తేదీకి వాయిదా వేసింది. పేదల ఇళ్లను కూల్చి వారిని రోడ్డున పడేస్తే ఊరుకునేది లేదని, చట్టం ముందు అందరూ సమానమేనని కోర్టు ఈ సందర్భంగా స్పష్టం చేసింది.




# పొలిటికల్ కలర్స్

- బిగ్‌బాస్ షోలా రెండు పార్టీల తీరు
- కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై బండి ఫైర్

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య సాగుతున్న సవాళ్లు, ప్రతిసవాళ్లపై కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ రెండు పార్టీల డ్రామాలు ప్రసిద్ధ టీవీ రియాలిటీ షో 'బిగ్ బాస్'ను తలపిస్తున్నాయని ఆయన ఎద్దేవా చేశారు. కెమెరాల ముందేమో కొట్టుకుంటూ.. అసలు సమయం వచ్చేసరికి ఒకరినొకరు కాపాడుకోవడం ఈ పార్టీలకు అలవాటుగా మారిందని విమర్శించారు. ఇదంతా ముందే రాసుకున్న స్క్రిప్ట్ ప్రకారం జరుగుతున్న నాటకమని ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా దుయ్యబట్టారు.

**అబద్ధాల నటనకు ఆస్కార్ అవార్డులు**


ప్రధాన పార్టీల నేతల నటన అద్భుతంగా ఉందంటూ బండి సంజయ్ సెటైర్లు వేశారు. వీరంతా ముందే రిహార్సల్స్ చేసుకుని మరి పోటాపోటీగా నటిస్తున్నారని ఆరోపించారు. ఒకవేళ అబద్ధాలు చెప్పే వారికి ఆస్కార్ అవార్డులు ఇస్తే.. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఇద్దరూ దానికి పూర్తిగా అర్హులవుతారని ఎగతాళి చేశారు. తెలంగాణ ప్రజలను అమాయకులుగా భావించవద్దని, ఇరు పార్టీల నేతల ప్రవర్తనను చూసి జనాలు నవ్వుకుంటున్నారని హితవు పలికారు. ఇలాంటి రాజకీయ నాటకాలకు ఇకనైనా ముగింపు పలకాలని డిమాండ్ చేశారు.

**బహిరంగ చర్చకు సిద్ధం కావాలని సవాల్**

రాష్ట్రంలో గురుకులాల టెండర్లు, పెరుగుతున్న అప్పులు, అవినీతి, పాలనా వైఫల్యాలపై బహిరంగ చర్చకు రావాలని బండి సంజయ్ సవాల్ విసిరారు. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావును కలిసి ఇందుకు తగిన వేదికను సిద్ధం చేయాల్సిందిగా కోరతానని స్పష్టం చేశారు. ఈ చర్చా వేదికపై ప్రజల ప్రశ్నలకు సమాధానాలు చెప్పే ధైర్యం కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలకు ఉందా అని ప్రశ్నించారు. రెండు పార్టీల అవినీతి బాగోతాన్ని నిజాలతో సహా ప్రజల ముందు ఉంచేందుకు బీజేపీ పూర్తిగా సిద్ధంగా ఉందని ప్రకటించారు.

**కేంద్ర ప్రభుత్వ అభివృద్ధిపై చర్చకు సిద్ధం**

గత కొన్నేళ్లుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రగతికి చేసిన కృషిని ప్రజలకు వివరిస్తామని బండి సంజయ్ తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం కేంద్రం అందించిన నిధులపై కూడా చర్చకు రావాలని సవాల్ చేశారు. తెలంగాణ ప్రజలు ఇప్పుడు కాంగ్రెస్, బీఆర్ఎస్ అనే రెండు పార్టీలను ఒకేసారి తొలగించే 'డబుల్ ఎలిమినేషన్'కు సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో సుపరిపాలన సాగాలంటే రాబోయే రోజుల్లో బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కార్‌ను స్వాగతించడానికి ప్రజలు ఆసక్తిగా ఉన్నారని బండి సంజయ్ పేర్కొన్నారు.



# పోలీస్ స్టేషన్ల పునర్వ్యవస్థీకరణపై సమీక్ష

**శాంతిభద్రతల బలోపేతానికి ముందడుగు!**

**హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి:** ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ల పరిధిలో పోలీస్ స్టేషన్ల పునర్వ్యవస్థీకరణపై తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్ గురువారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా స్టేషన్ల సరిహద్దులను నిర్ణయించాలని అధికారులను ఆదేశించారు. జనాభా పెరుగుదల, పట్టణ విస్తరణ, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ మార్పులు చేపట్టాలన్నారు. మున్సిపల్, రెవెన్యూ, కోర్టు పరిధులను పరిగణనలోకి తీసుకుని హద్దులు నిర్ణయించాలని డీజీపీ సూచించారు. ఈ మార్పుల వల్ల ప్రజలకు, ప్రభుత్వ శాఖలకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదని స్పష్టం చేశారు. భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా స్టేషన్లకు పేర్లు పెట్టాలన్నారు. ఈ పునర్వ్యవస్థీకరణ ద్వారా సమర్థవంతమైన పోలీసింగ్ బలోపేతం కావాలని ఆకాంక్షించారు. సమావేశంలో సీపీలు వి.సి. సజ్జనార్, తరుణ్ జోషి, రమేష్ రెడ్డి, సుమతి పాల్గొన్నారు.

తెలంగాణ పొలిటికల్ వార్
సవాళ్లు ప్రతిసవాళ్లతో హీట్

# సవాళ్లతో హంగామా
## రక్తికట్టించిన పొలిటికల్ డ్రామా

పొలిటికల్ రణరంగం
తెలంగాణలో సవాళ్ల పర్వం ముదిరిన మాటల యుద్ధం

**తెలంగాణ పొలిటికల్ స్క్రీన్‌పై అప్పుడే హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్ మొదలైపోయింది! ఎన్నికలకు ఇంకా రెండున్నరేళ్ల సుదీర్ఘ సమయం ఉన్నప్పటికీ.. ప్రధాన పార్టీల మధ్య సాగుతున్న సవాళ్లు, ప్రతిసవాళ్లు చూస్తుంటే రాష్ట్రంలో పొలిటికల్ క్లైమాక్స్ ఇప్పుడే వచ్చేసిందా అనే రేంజ్‌లో హీట్ ఎలివేట్ అవుతోంది. పాలన, అభివృద్ధి కంటే.. ఒకరినొకరు పొలిటికల్‌గా దెబ్బకొట్టుకోవడమే ఏకైక అజెండాగా సాగుతున్న ఈ మైండ్ గేమ్‌లో లీడర్లు విసురుతున్న డైలాగులు బాక్సులు బద్దలయ్యేలా చేస్తున్నాయి. ఒకవైపు "దమ్ముంటే చర్చకు రండి.. లెక్కలు తేల్చకపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటా" అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విసిరిన ఆటంబాంబ్ లాంటి సవాల్.. దానికి ప్రతిగా "తెలంగాణ భవన్‌కు వస్తున్నా.. కుర్చీ సిద్ధం చేసుకోండి" అంటూ మంత్రి జూపల్లి కృష్ణారావు చేసిన కౌంటర్ ఎటాక్ రాష్ట్ర రాజకీయాలను రణరంగంగా మార్చేశాయి. గాంధీ భవన్, తెలంగాణ భవన్ చుట్టూ పోలీస్ బందోబస్తులు, రోజుకో పొలిటికల్ చాలెంజ్‌లతో వాతావరణం మునుపెన్నడూ లేనంతగా వేడెక్కింది. ఇదంతా ఒకెత్తయితే.. వచ్చే డిసెంబర్ నుంచి 'ఉత్తర తెలంగాణ' వేదికగా విపక్షాల కోటలను బద్దలు కొట్టేందుకు సీఎం రేవంత్ రెడ్డి పక్కా పొలిటికల్ స్కెచ్‌తో గ్రౌండ్‌లోకి దిగుతున్నారు. బస్సు యాత్రలు, పాదయాత్రలతో బీజేపీ, బీఆర్ఎస్‌లపై ముకుమ్మడి దాడికి కాంగ్రెస్ వ్యూహాలు సిద్ధం చేస్తోంది. ముందస్తుగానే ఎలక్షన్ మూడ్‌ను తలపిస్తూ.. హీట్ పెంచుతున్న తెలంగాణ లేటెస్ట్ పొలిటికల్ వార్‌పై ప్రత్యేక కథనం..!!**

రాష్ట్ర రాజకీయాల్లో సవాళ్ల ప్రతిసవాళ్లతో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. అధికార పార్టీని ఎండగట్టడమే పనిగా బీఆర్ఎస్ పనిచేస్తోంది. విపక్ష బీఆర్ఎస్ లక్ష్యంగా ఈ మధ్య సీఎం రేవంత్ కూడా ఘాటుగానే దాడి చేస్తున్నారు. మొత్తంగా అభివృద్ధి, ప్రజల అవసరాలు పక్కకు పోయాయి. సవాళ్లు, ప్రతిసవాళ్లు నడుస్తున్నాయి. తమ రాజకీయం కోసం రాష్ట్ర అభివృద్ధిని, పాలనను పక్కన పెట్టారు. తెలంగాణలో అంతకుమించి అన్నట్లుగా సవాళ్లు, ప్రతిసవాళ్లతో రాజకీయాలు వేడెక్కాయి. ఇప్పుడే ఎన్నికలు లేవు. మరో రెండున్నరేళ్ల సమయం ఉంది. అయినా అప్పుడే ఎన్నికల వేడి పుట్టించేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీది రెండున్నరేండ్ల చెత్త పాలన అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్ రావులు విమర్శలు గుప్పిస్తున్నారు. బీఆర్ఎస్ అప్పులు చేసి, రాష్ట్రాన్ని ఆగం చేసిందని సీఎం రేవంత్ సహా మంత్రులు సందర్భం వచ్చిన ప్రతిసారీ విమర్శలు గుప్పిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అవినీతి, అక్రమాల పై లెక్కలతో పక్కాగా వివరిస్తామని ప్రతిగా బీఆర్ఎస్ నేతలు సవాళ్లు విసురుతున్నారు.

### కేటీఆర్ సవాల్.. జూపల్లి ప్రతిసవాల్

అసెంబ్లీ లేకపోతే వేదిక ఏదైనా బీఆర్ఎస్ తరఫున తాను చర్చకు వస్తా.. రాహుల్‌గాంధీ వస్తారో? ఇంకెవరొస్తారో తేల్చుకోండి.. మీ పాలనావైఫల్యాలను లెక్కలతో బయటపెట్టకపోతే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకొంటానని కేటీఆర్ చాలెంజ్ చేశారు. కేటీఆర్ సవాల్‌కు మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించారు. తాను తెలంగాణ భవన్‌కు వస్తానని మంత్రి ప్రతి సవాల్ విసిరారు. మంత్రి చాలెంజ్‌ను స్వీకరించిన బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ భవన్‌లో మీ కోసం ప్రత్యేకంగా కుర్చీ రెడీగా ఉంది.. మీదే ఆలస్యం దమ్ముంటే చర్చకు రావాలన్నారు.

### సరిహద్దుల్లో పోలీసుల భారీ బందోబస్తు

దీంతో ఒక్కసారిగా రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. అటు తెలంగాణ భవన్, ఇటు గాంధీ భవన్ వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జూపల్లి వ్యాఖ్యల నేపథ్యంలో కేటీఆర్, హరీశ్ రావు బీఆర్ఎస్ భవన్‌కు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. జూపల్లి వస్తే కేంద్ర ప్రభుత్వ నివేదికలు, ఆర్‌బీఐ లెక్కలు, సాక్ష్యాలతో సహా వివరిస్తామని వారు తెలిపారు. జూపల్లితో చర్చకు కేటీఆర్ అవసరం లేదని తాను సరిపోతానని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కావాలంటే కేటీఆర్ కూడా వస్తారన్నారు. ఇలా రోజుకో సవాల్, ప్రతి సవాల్‌లో రాజకీయాలు నడుస్తున్నాయి.

### కాంగ్రెస్ అప్పుల బాగోతంపై పోరాటం

ఏ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారు.. ఎన్ని నెరవేర్చారో చర్చకు బరాబర్ సిద్ధమేనన్నారు. కాంగ్రెస్ అప్పుల బాగోతాన్ని లెక్కలతో తిప్పికొడుతామన్నారు. సవాళ్లు, ప్రతి సవాళ్ల నేపథ్యంలో తెలంగాణలో రాజకీయాలు హాట్ హాట్‌గా సాగుతున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి కూడా ప్రత్యర్థులకు చెక్ పెట్టేందుకు... బీజేపీ, బీఆర్ఎస్‌లను లక్ష్యంగా నేరుగా విమర్శలు చేస్తున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా రెండున్నరేళ్ళ సమయం ఉన్నా, అప్పుడే ఎలక్షన్ మూడ్ వచ్చేస్తున్నట్టు కనిపిస్తోంది. అన్ని రాజకీయ పార్టీలు అదే తరహా ప్లానింగ్‌లో ఉన్నాయి.

### రేవంత్ రెడ్డి వ్యూహాత్మక అడుగులు

అధికారంలో ఉన్నాం కాబట్టి ఎక్కడా తగ్గకూడదన్న ఉద్దేశం కాంగ్రెస్ పార్టీలో, ప్రత్యేకించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలో కనిపిస్తోంది. రాష్ట్రంలో రెండోసారి అధికారం చేపట్టేందుకు అవసరమైన ఎత్తుగడలకు ఆయన పదును పెడుతున్నట్టు కనిపిస్తోంది. ఎందుకంటే మళ్లీ కాంగ్రెస్ సర్కార్ వస్తుందని, తానే సీఎంనని పదేపదే ప్రకటిస్తున్నారు. ఇదంతా ఒక ఎత్తయితే విపక్ష బీఆర్ఎస్, బీజేపీలను దెబ్బకొట్టడంతో పాటు, బలంగా లేని చోట కాంగ్రెస్‌ను బలోపేతం చేసే పనిలో పడ్డారని తెలుస్తోంది. ముఖ్యంగా పార్టీ ఎక్కడైతే బలంగా లేదో అక్కడి నుంచే కార్యాచరణ మొదలు పెట్టాలని రేవంత్ రెడ్డి పని చేస్తున్నారు.

### ఉత్తర తెలంగాణపై ప్రత్యేక ఫోకస్

ఆ రెండు పార్టీలకు చెక్ పెట్టడానికి అక్కడి నుంచే యుద్ధం ప్రారంభించాలని సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్‌లో దీనికి సంబంధించిన చర్చలు గట్టిగానే నడుస్తున్నాయి. వచ్చే డిసెంబర్ నుంచి తన పొలిటికల్ స్కెచ్‌ని అమలు చేసే పనిలో ముఖ్యమంత్రి ఉన్నట్టు తెలుస్తోంది. అందుకు ఇప్పటినుంచి గ్రౌండ్ వర్క్ మొదలు పెట్టినట్టు సమాచారం. డిసెంబర్ తర్వాత పూర్తిగా గ్రౌండ్‌లోనే ఉండాలని రేవంత్ డిసైడ్ అయినట్టు కనపడుతోంది. అందుకోసం ప్రధానంగా ఉత్తర తెలంగాణ మీద ఫోకస్ పెట్టబోతున్నారట.

### బస్సు యాత్రకు పొలిటికల్ స్కెచ్

దక్షిణ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి గట్టి పట్టుంది. గత ఎన్నికల్లో ఆ విషయం నిరూపితమైంది కూడా. ఉత్తర తెలంగాణలో బీజేపీ బలపడుతున్నందున ఇక అక్కడ ఫోకస్ చేయాలన్నది సీఎం ప్లాన్‌గా తెలుస్తోంది. ఉత్తర తెలంగాణ నుండి తన రాజకీయ వ్యూహాన్ని అమలు చేసే పనిలో భాగంగా బస్సు యాత్ర లేదంటే పాదయాత్ర చేయాలని భావిస్తున్నట్టు సమాచారం. ప్రభుత్వ పథకాల అమలు, రాజకీయ ఎత్తుగడల్ని అక్కడి నుంచే అమలు చేయాలని భావిస్తున్నారని సమాచారం. వచ్చే ఎన్నికల నాటికి బీఆర్ఎస్, బీజేపీల కట్టడిని అక్కడి నుంచే మొదలు పెట్టాలనుకుంటున్నట్లు అర్థం అవుతోంది.



### రెండు పార్టీలపై ముకుమ్మడి దాడి

ఓట్ బ్యాంకును పెంచుకోవడంతో పాటు, తన రెండున్నరేళ్ళ పాలన, గత బీఆర్ఎస్ పాలనపై చర్చకు పెట్టడంతో పాటు కేంద్రంలోని బీజేపీ తీరు, రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయం గురించి కూడా ప్రజలు మాట్లాడుకునేలా చేయాలనుకుంటున్నట్టు తెలుస్తోంది. గత ఎన్నికలకు ముందు పాదయాత్ర నిర్వహించారు రేవంత్‌రెడ్డి. అది ఎలా ఉన్నా విపక్ష పార్టీలకు చెక్ పెట్టే లక్ష్యంతో ఏకంగా రెండు పార్టీలపై దాడిని ముమ్మరం చేశారు. దీంతో తెలంగాణలో రాజకీయం మరింత వేడెక్కింది.

---

రాష్ట్ర రాజకీయాల్లో ఊహించని ఉద్రిక్త పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లతో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. కాంగ్రెస్ పార్టీ సాగిస్తున్న రెండున్నరేళ్ల చెత్త పాలనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. ప్రభుత్వ అవినీతి, అక్రమాలను లెక్కలతో సహా పక్కాగా నిరూపిస్తానని ఆయన స్పష్టం చేశారు. వరంగల్ ప్రెస్‌క్లబ్, అశోక్‌నగర్ లేదా అసెంబ్లీ.. వేదిక ఏదైనా చర్చకు తాను సిద్ధమని, కాంగ్రెస్ తరఫున రాహుల్‌గాంధీ వస్తారో లేక ఇంకెవరైనా వస్తారో తేల్చుకోవాలని కేటీఆర్ సవాల్ విసిరారు. పాలనా వైఫల్యాలను నిరూపించకపోతే రాజకీయాల నుండి శాశ్వతంగా తప్పుకుంటానని ప్రకటించారు.

### జూపల్లి కౌంటర్.. తెలంగాణ భవన్ వద్ద భారీ బందోబస్తు

కేటీఆర్ విసిరిన సవాల్‌కు మంత్రి జూపల్లి కృష్ణారావు గట్టిగా స్పందించారు. తాను గురువారం ఉదయం 11 గంటలకు బీఆర్ఎస్ ప్రధాన కార్యాలయమైన తెలంగాణ భవన్‌కు వస్తానని ప్రతిసవాల్ చేశారు. ఈ చాలెంజ్‌ను స్వీకరించిన బీఆర్ఎస్ శ్రేణులు.. మంత్రి కోసం ప్రత్యేకంగా కుర్చీ సిద్ధం చేశామని, దమ్ముంటే చర్చకు రావాలని పేర్కొన్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో అటు తెలంగాణ భవన్, ఇటు కాంగ్రెస్ కార్యాలయమైన గాంధీ భవన్ వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జూపల్లి వస్తే ఆర్‌బీఐ లెక్కలు, కేంద్ర ప్రభుత్వ నివేదికల సాక్ష్యాలతో తిప్పికొడతామని కేటీఆర్, హరీశ్ రావు వ్యూహాలు సిద్ధం చేసుకున్నారు. జూపల్లితో చర్చకు కేటీఆర్ అవసరం లేదని, తాను ఒక్కడినే సరిపోతానని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ వ్యాఖ్యానించారు.

### గురుకులాల టెండర్ల వివాదం.. గన్‌పార్క్ వద్దకు మంత్రులు

ఇదే సమయంలో గురుకులాల టెండర్లలో జరిగిన అవినీతి ఆరోపణలపై సరికొత్త ట్విస్ట్ చోటు చేసుకుంది. కేటీఆర్, హరీశ్ రావు చర్చల కోసం గన్‌పార్క్‌కు రావాలని కాంగ్రెస్ మంత్రులు సవాల్ విసిరారు. దీనికి మాజీ మంత్రి హరీశ్ రావు అంగీకరించారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో కలిసి ఆయన గన్‌పార్క్ బయలుదేరారు. తాము ప్రెస్‌క్లబ్‌కు రమ్మంటే మంత్రులు గన్‌పార్క్‌కు రమ్మన్నారని, తమకు ఎలాంటి భేషజాలు లేవు కాబట్టి చర్చకు వస్తున్నామని హరీశ్ రావు తెలిపారు. ఎలాంటి గొడవలు లేకుండా కూర్చొని మాట్లాడుకుందామని, డ్రగ్స్ సరఫరా చేసే వారికి టెండర్లు ఇచ్చారనే ఆరోపణలను రుజువు చేస్తామని చెప్పారు. ఒకవేళ మంత్రి జూపల్లి తెలంగాణ భవన్‌కు వెళ్తే.. అక్కడ కేటీఆర్ చర్చించడానికి సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.

### హరీశ్ రావును అడ్డుకున్న పోలీసులు.. తీవ్ర ఉద్రిక్తత

గన్‌పార్క్‌కు బయలుదేరిన హరీశ్ రావును పోలీసులు తెలంగాణ భవన్ వద్దే అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. ముగ్గురు మంత్రులు రమ్మంటేనే తాము వెళ్తున్నామని, తమను ఎందుకు ఆపుతున్నారని హరీశ్ రావు పోలీసులను ప్రశ్నించారు. కావాలంటే మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఫోన్ చేసి కనుక్కోవాలని సూచించారు. ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని చర్చల నుండి పారిపోవాలని చూస్తోందని మండిపడ్డారు. ఈ క్రమంలో పోలీసులు, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగాయి. కారు దిగి పాదయాత్రగా వెళ్లేందుకు ప్రయత్నించిన హరీశ్ రావు ఆ తోపులాటలో కిందపడిపోయారు. వెంటనే పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఆయనతో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

### అమరవీరుల స్థూపం వద్ద మంత్రుల బైఠాయింపు

గురుకులాల టెండర్ల అవినీతిపై చర్చించేందుకు కాంగ్రెస్ మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, అజారుద్దీన్ గన్‌పార్క్‌కు చేరుకున్నారు. అమరవీరుల స్థూపం వద్ద వారు కింద కూర్చుని బీఆర్ఎస్ నేతల కోసం నిరీక్షించారు. మంత్రులకు మద్దతుగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కూడా అక్కడకు వచ్చారు. అధికార, ప్రతిపక్ష నాయకుల సవాళ్ల పర్వంతో గన్‌పార్క్ ప్రాంతంలో వందలాది మంది పోలీసులు మోహరించారు. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్, తెలంగాణ భవన్ ప్రాంతాలను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. తాము చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉన్నామని, ప్రభుత్వం భయపడే పోలీసులతో అరెస్టులు చేయించిందని బీఆర్ఎస్ శ్రేణులు ఆరోపిస్తున్నాయి.





# చర్చలకు భయపడి కాంగ్రెస్ పలాయనం!

- **కాంగ్రెస్ పారిపోయిందన్న హరీశ్ రావు**

బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పులపై చర్చకు రమ్మని పిలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఆ పార్టీ మంత్రులు ఇప్పుడు తోక ముడిచి పారిపోయారని మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, తాను, ఇతర ముఖ్య నాయకులు చర్చలకు వెళ్లేందుకు ప్రయత్నిస్తే పోలీసులు అడ్డుకున్నారని దుయ్యబట్టారు. తాము స్వయంగా చర్చకు వస్తుంటే ఇలా పోలీసులతో అడ్డుకుని అరెస్టులు చేయించడంలో ఆంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు.

### మంత్రి జూపల్లి మాటల మార్పుపై విమర్శలు

బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 8 లక్షల కోట్లు అప్పు చేసిందని ఒకరోజు, మరో రోజు రూ. 7 లక్షల కోట్లని కాంగ్రెస్ నేతలు మాటమారుస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. లెక్కలపై స్పష్టత లేని మంత్రి జూపల్లి కృష్ణారావు చర్చలకు రాకుండా తప్పించుకుంటున్నారని మండిపడ్డారు. గతంలో జరిగిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో తానే స్వయంగా పాల్గొని బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పుల గురించి వివరంగా మాట్లాడి ప్రభుత్వ నోరు మూయించానని వెల్లడించారు. నాటి సమావేశంలో తాను విసిరిన సవాలుకు సమాధానం ఇవ్వలేకనే అప్పట్లో అసెంబ్లీని వాయిదా వేశారని గుర్తు చేశారు.

### అరెస్టులతో ప్రతిపక్షాల నోరు నొక్కే ప్రయత్నం

తెలంగాణ భవన్‌కు వస్తానన్న మంత్రి కోసం కేటీఆర్ అన్ని ఏర్పాట్లు చేశారని హరీశ్‌రావు తెలిపారు. అయితే భవన్‌కు రాకుండా అమరవీరుల స్థూపం వద్దకు రమ్మని జూపల్లి కోరడంతో అక్కడికి వెళ్లేందుకు సిద్ధమైన తమను పోలీసులు అక్రమంగా అడ్డుకున్నారని ఆరోపించారు. ప్రభుత్వ గురుకుల పాఠశాలలకు చెందిన సుమారు రూ. 2 వేల కోట్ల టెండర్లలో భారీగా అవినీతి, అక్రమాలు జరిగాయని చెప్పారు. వీటిపై చర్చల నుంచి కూడా ప్రభుత్వం పారిపోయిందన్నారు. చర్చలకు రమ్మన్న ముగ్గురు మంత్రులకు ఫోన్లు చేస్తే ఎత్తలేదని, వారిని కలవడానికి వెళ్తుంటే అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారని మండిపడ్డారు. చర్చలు జరిగితే కాంగ్రెస్ బండారం బయటపడుతుందనే భయంతోనే ఈ అరెస్టులు చేశారని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

---

# గురుకులాల సవాల్

- **నిజాలు తేల్చేందుకు సిద్ధమైన యంత్రాంగం**
- **అవినీతి ఆరోపణలపై మంత్రి పొన్నం దూకుడు**

గురుకులాల టెండర్లలో అవినీతి జరిగిందంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలపై చర్చించేందుకు తాము బరాబర్ సిద్ధమని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ విసిరిన సవాల్‌ను స్వీకరిస్తూ మంత్రులు గురువారం హైదరాబాద్‌లోని గన్‌పార్క్ అమరవీరుల స్థూపం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య దేవాలయం లాంటి అసెంబ్లీ వేదికగా తాము చర్చకు సిద్ధమని గతంలోనే చెప్పామని గుర్తుచేశారు. ఒకవేళ ప్రెస్‌క్లబ్‌కు రమ్మన్నా తాము రావడానికి వెనుకాడబోమని తేల్చిచెప్పారు.

### ఎన్నికైన ప్రతినిధులతోనే ముఖాముఖి

రాజ్యాంగబద్ధంగా ప్రజల చేత ఎన్నికైన ప్రజాప్రతినిధులతోనే తాము చర్చిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు వస్తే తాము ఎక్కడైనా కూర్చొని మాట్లాడతామన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో లాగా తమ పాలనలో కడప కాంట్రాక్టర్లకు టెండర్లు ఇవ్వలేదని ఆయన ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వం గురుకులాల టెండర్ల ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించిందని వెల్లడించారు. టెండర్ల కోసం ముందుకు వచ్చిన కాంట్రాక్టర్లు తమకు చుట్టాలు కాదని ఆయన స్పష్టం చేశారు.

### తప్పు నిరూపిస్తే ముక్కు నేలకు రాస్తాం

బీఆర్ఎస్ నాయకులు అవినీతి మొత్తం విలువపై ఏది పడితే అది మాట్లాడుతున్నారని పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. అసలు అవినీతి జరిగింది రూ.2 వేల కోట్లా లేక రూ.5 వేల కోట్లా అనే దానిపై స్పష్టత లేకుండా ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. సరైన ఆధారాలతో వస్తే తాము సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఒకవేళ తాము అవినీతి చేసినట్లు నిరూపిస్తే.. ముగ్గురు మంత్రులం గన్‌పార్క్ సాక్షిగా ముక్కు నేలకు రాసి, పదవులకు రాజీనామా చేస్తామని సంచలన ప్రకటన చేశారు. తాము పిరికివాళ్లం కాదని, కానీ ఎవరితో పడితే వారితో చర్చలకు వెళ్లబోమని తేల్చిచెప్పారు.

### బీఆర్ఎస్ నేతలకు మంత్రి ఘాటు హెచ్చరిక

మాజీ సీఎం కేసీఆర్ తన గులాబీ పార్టీ నేతలను అదుపులో పెట్టుకోవాలని, లేదంటే ఆయనకే చెడ్డపేరు వస్తుందని మంత్రి హితవు పలికారు. బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఏ విషయమైనా మాట్లాడేటప్పుడు ఒళ్లు దగ్గర పెట్టుకోవాలని హెచ్చరించారు. గతంలో ఆయనే అవినీతి చేసి ఉండవచ్చని, అలాంటి వ్యక్తికి తాము సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని అన్నారు. తమ జోలికి వచ్చి అనవసరంగా ఇబ్బందులు కొనితెచ్చుకోవద్దని ఆర్ఎస్పీకి మంత్రి పొన్నం ప్రభాకర్ ఘాటుగా హెచ్చరించారు.

---

## వైఫల్యాలతో కాంగ్రెస్
# పారిపోతోంది: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి..)
ఎక్కడైనా చర్చకు తాము సిద్ధమని స్పష్టం చేస్తూ.. సవాల్ విసిరిన ముఖ్యమంత్రే ఇప్పుడు వెనకడుగు వేశారని సెటైర్లు గుప్పించారు.

### జూపల్లి వ్యాఖ్యలపై వ్యంగ్యాస్త్రాలు

మంత్రి జూపల్లి కృష్ణారావు మధ్యలో సవాల్ విసిరారని.. సీఎం పంపితేనే ఆయన వస్తున్నారని తాము అనుకున్నామని కేటీఆర్ చెప్పారు. కానీ జూపల్లి కేవలం పనికిమాలిన డైలాగ్‌లు కొడుతున్నారని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. సవాల్ విసిరిన మంత్రులు చర్చకు రాకుండా పారిపోతున్నారంటేనే ఈ ప్రభుత్వ అసమర్థత



ఏంటో ప్రజలకు అర్థమైందని ఎద్దేవా చేశారు. చేతకాని వాళ్లు అసలు సవాళ్లు ఎందుకు విసరాలని ఆయన గట్టిగా నిలదీశారు.

### హరీశ్ రావు అరెస్టుపై ఆగ్రహం

మాజీ మంత్రి హరీశ్‌రావు చర్చకు బయల్దేరగానే ఈ ప్రభుత్వం ఎందుకు అరెస్ట్ చేయించిందని కేటీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ మంత్రులే గన్‌పార్కుకు రమ్మన్నారని.. అక్కడికి వెళ్తుంటే పోలీసులను అడ్డుపెట్టి అరెస్ట్ చేయించడం ప్రభుత్వ పిరికితనానికి నిదర్శనమన్నారు. నిజాలు మాట్లాడే ధైర్యం లేకనే అరెస్టులకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ఇతర అంశాలపై అసెంబ్లీలో తనకు మాట్లాడటానికి ఒక గంట సమయం ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

---

## అప్పుల బాగోతం చెప్తా
# జూపల్లి సవాల్!

(మొదటి పేజీ తరువాయి..)
జూపల్లి సంచలన ప్రకటన చేశారు. కార్పొరేషన్ల పేరుతో తెచ్చిన ఈ భారీ అప్పులను ఎలా తీరుస్తారో గత పాలకులు ఎందుకు చెప్పలేదని నిలదీశారు.

### కేసీఆర్ మౌనంపై ప్రశ్నల వర్షం

రాష్ట్రంలో ఇంత జరుగుతున్నా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎందుకు మాట్లాడటం లేదని మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రశ్నించారు. తాము అప్పులు చేయలేదని కేసీఆర్ గుండెల మీద చేయి వేసుకుని చెప్పగలరా అని అడిగారు. ఈ అప్పులన్నింటినీ రైతుల నుండి వసూలు చేస్తారా.. ఒక్కో రైతు నుండి రూ.20 లక్షలు వసూలు చేస్తారా అని నిలదీశారు. తమ వద్ద ఉన్న ప్రభుత్వ అధికారిక రికార్డులు, కాగితాలు ఇస్తామని.. బీఆర్ఎస్ నేతలు చర్చకు రావాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ ఇప్పటికీ తప్పుడు మాటలతో బుకాయిస్తున్నారని మండిపడ్డారు.



### నెలకు ఆరు వేల కోట్ల వడ్డీల భారం

గత ప్రభుత్వం చేసిన ఇష్టారాజ్యపు అప్పుల కారణంగా ప్రస్తుతం కాగ్రెస్ ప్రభుత్వం నెలకు రూ.6 వేల కోట్ల వడ్డీలు కట్టాల్సి వస్తోందని జూపల్లి ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ చేసిన అప్పుల వివరాలను కేసీఆర్ స్వయంగా మీడియా ముందుకు వచ్చి ఒప్పుకోవాలని డిమాండ్ చేశారు. మరోవైపు అప్పులపై చర్చించేందుకు తెలంగాణ భవన్‌కు వస్తానన్న మంత్రి జూపల్లి ఎందుకు రాలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. జూపల్లి కోసం కేటీఆర్ అక్కడ వేచి చూస్తున్నారని.. చర్చకు సవాల్ విసిరిన కాంగ్రెస్ మంత్రులే ఇప్పుడు తోక ముడిచి పారిపోయారని హరీశ్‌రావు విమర్శించారు.

# భుజం తట్టిన జనసేనాని..!

- కష్టపడండి... ప్రతిఫలం తప్పకుండా దక్కుతుంది
- జనసేనలో యల్లటూరుకు కీలక పదవికి పవన్ భరోసా
- రైల్వేకోడూరు పర్యటనలో శ్రీనివాసరాజుపై ఫోకస్



రాజకీయాల్లో ఒక్క సంఘటన నాయకుడి ప్రస్థానాన్ని కొత్త దిశలో నడిపిస్తుంది. అలాంటి పరిణామమే రైల్వేకోడూరు నియోజకవర్గంలోని మంగంపేటలో కనిపించింది. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమక్షంలో రాజంపేట పార్లమెంట్ జనసేన ఇంఛార్జి యల్లటూరు శ్రీనివాసరాజుకు లభించిన ప్రత్యేక గుర్తింపు ఇప్పుడు పార్టీలో చర్చకు దారితీసింది. కార్యక్రమానికి భారీగా తరలివచ్చిన కార్యకర్తలతో ప్రాంతమంతా జనసేన సందడిగా మారింది. యల్లటూరు ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొనడం పార్టీ నాయకత్వాన్ని ఆకట్టుకున్నట్లు శ్రేణులు భావిస్తున్నాయి. కార్యక్రమం అనంతరం పవన్ కళ్యాణ్ స్వయంగా యల్లటూరుతో మాట్లాడి భుజం తట్టి అభినందించడం కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ పరిణామం ఆయనకు భవిష్యత్తులో మరింత కీలక బాధ్యతలు దక్కే అవకాశాలపై అంచనాలను పెంచుతోంది.

**నిబద్ధతతో సాగిన రాజకీయ ప్రయాణం**

యల్లటూరు శ్రీనివాసరాజు జనసేన అధికారంలోకి వచ్చిన తర్వాత చేరిన నాయకుడు కాదు. పార్టీ బలోపేత దశలోనే ప్రభుత్వ ఉన్నత ఉద్యోగానికి రాజీనామా చేసి పవన్ కళ్యాణ్ ఆశయాలను నమ్మి రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. నాలుగేళ్లుగా గ్రామగ్రామాన తిరుగుతూ పార్టీ విస్తరణకు కృషి చేశారు. ఇటీవల నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ పరిధిని రాష్ట్రంలో తొలి ఐదు స్థానాల్లో నిలిపేందుకు కీలక పాత్ర పోషించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇంటింటికీ వెళ్లి సభ్యత్వ నమోదు చేపట్టడం, కొత్త కార్యకర్తలను చేర్చుకోవడం, పార్టీ కార్యక్రమాలను విస్తరించడం ద్వారా ఆయన క్షేత్రస్థాయిలో బలమైన నాయకుడిగా గుర్తింపు పొందారు. ఈ కృషినే రాష్ట్ర నాయకత్వం ప్రత్యేకంగా గుర్తించినట్లు సమాచారం.

**కీలక బాధ్యతలపై పెరిగిన అంచనాలు**

మంగంపేట పర్యటనలో దాదాపు 2 వేల మంది కార్యకర్తలతో యల్లటూరు పాల్గొనడం ఆయనకు ఉన్న ప్రజాబలం, పార్టీ బలాన్ని ప్రతిబింబించింది. కష్టపడే నాయకులకు గుర్తింపు తప్పదని పవన్ కళ్యాణ్ పలుమార్లు చెప్పిన మాటలను ఈ సందర్భంగా మరోసారి ఆచరణలో చూపించారని జనసేన నాయకులు పేర్కొంటున్నారు. పార్టీ పదవుల కోసం అంకితభావంతో పనిచేసే నాయకుల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని పవన్ సూచించినట్లు ప్రచారం సాగుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో యల్లటూరు శ్రీనివాసరాజుకు సంస్థాగతంగా కీలక పదవి దక్కే అవకాశాలపై పార్టీ శ్రేణుల్లో విస్తృత చర్చ కొనసాగుతోంది. అధికారిక ప్రకటన కోసం కార్యకర్తలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. క్షేత్రస్థాయిలో నిరంతరం శ్రమించే నాయకులకు ప్రాధాన్యం కల్పించాలనే జనసేన ఆలోచనలో యల్లటూరు పేరు ఇప్పుడు మరింత బలంగా వినిపిస్తోంది. ఆయనకు లభించిన ఈ గుర్తింపు పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలకు కూడా కొత్త ప్రేరణగా మారింది.



6లో..

# జ(మావి)గన్ నినాదం

- రాజకీయమా..? సిద్ధాంతమా..?
- జనంలోకి బలంగా వెళ్లడమా.. !
- అది నినాదమా.. పొలిటికల్ ఆయుధమా?

అవిగో.. 2029కి అజెండా సెట్ అయిపోయింది. అమరావతికి చట్టబద్ధత ముద్ర పడి కథ ముగిసిందనుకున్న వేళ.. ఏపీ రాజకీయ యవనికపై "స్టాండ్ విత్ మావిగన్" అంటూ జగన్ మోహన్ రెడ్డి విసిరిన సరికొత్త అస్త్రం రాష్ట్ర రాజకీయాలను ఒక్కసారిగా షేక్ చేసింది. ఇది కేవలం ఒక నినాదం కాదు.. అమరావతి సామ్రాజ్యానికి ఎదురుగా నిలబెట్టిన ప్రాంతీయ వికేంద్రీకరణ సిద్ధాంతం! కూటమి సర్కార్ అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా చూపించి ఓట్లు అడుగుతుంటే.. జగన్ మాత్రం 'మావిగన్' నినాదంతో సరికొత్త వ్యూహాత్మక అజెండాను సెట్ చేశారు. ఇది రాజకీయ లబ్ధి కోసం వేసిన మైండ్ గేమా? లేక వెనుకబడిన ప్రాంతాల ఆత్మగౌరవ పోరాటమా? ఓటరు దేవుడు అభివృద్ధి వైపు నిలబడతాడా.. వికేంద్రీకరణకు జై కొడతాడా? 2029 కురుక్షేత్రంలో గెలుపు గుర్రాన్ని డిసైడ్ చేయబోయే ఈ 'రాజధాని' యుద్ధంపై ఇంట్రెస్టింగ్ అనాలిసిస్..!!



వివరాలు 5లో..

# పల్లె ప్రగతికి నూతన శకం!

- అమలులోకి వీబీజీరాంజీ పథకం
- రూపురేఖలు మారనున్న గ్రామీణ ప్రాంతాలు
- ప్రారంభించిన కేంద్ర మంత్రి, సీఎం, డిప్యూటీ సీఎం
- వీబీజీ రాంజీతో రాష్ట్రాలకు రూ.7.5 లక్షల కోట్ల కేంద్ర నిధులు
- ప్రతీ గ్రామ పంచాయితీకి ఏడాదికి రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు
- పథకం భారం కాదు బాధ్యతన్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- తోతాపురి మామిడి కొనుగోళ్లకు కేంద్ర మంత్రి చౌహాన్ హామీ

కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందించిన 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ ఆజీవికా మిషన్' (వీబీజీరాంజీ) పథకం ఆంధ్రప్రదేశ్ నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చింది. తిరుపతి జిల్లా రైల్వేకోడూరు ఈ చారిత్రక ఘట్టానికి వేదికగా నిలిచింది. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కలిసి ఈ మెగా పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ముక్కావారిపల్లి గ్రామంలో రూ.4.55 లక్షల వ్యయంతో ప్రతిపాదించిన సామాజిక వర్షపు నీటి సంరక్షణ కుంట, మ్యాజిక్ డ్రెయిన్, మొక్కల పెంపకం పనులకు ముగ్గురు నేతలూ శ్రీకారం చుట్టారు. స్థానిక లబ్దిదారులకు వీబీజీ రామ్ జీ జాబ్ కార్డులను అందజేశారు. కేంద్ర మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, కమలేష్ పాశ్వాన్ ఈ పథకం ప్రోత్సాహక గీతాన్ని ఆవిష్కరించారు. సమాచార బుక్ లెట్, పోర్టల్ ను కూడా నేతలు విడుదల చేశారు.

**గ్రామాల అభ్యున్నతి కూటమి ప్రభుత్వ లక్ష్యం**

రైల్వేకోడూరు నియోజకవర్గం నుంచి ఈ చారిత్రక పథకం ప్రారంభం కావడం శుభపరిణామమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. గతంలో నరేగా పథకం రాయలసీమ నుంచే మొదలైందని, ఇప్పుడు వీబీజీ రామ్ జీ కూడా ఇక్కడి నుంచే ఆవిష్కృతం కావడం విశేషమని చెప్పారు. కేంద్రం నుంచి రూ.7,700 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి మరో రూ.4 వేల కోట్ల నిధులతో ఈ పథకం పనులను ముందుకు తీసుకెళ్తామని వెల్లడించారు. మొత్తం రూ.11వేల కోట్ల భారీ వ్యయంతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సారధ్యంలో గ్రామాల్లో పెద్ద ఎత్తున మౌలిక వసతులు కల్పిస్తామని స్పష్టం చేశారు.



- ఏపీ వేదికగా దేశవ్యాప్త విప్లవం
- పంట కుంటతో శుభారంభం
- అమలుల్లోకి వీబీజీరాంజీ

జాతీయ స్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకమైన 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ ఆజీవికా మిషన్' (వీబీజీ రాంజీ) గ్రామీణ చట్టం ఆంధ్రప్రదేశ్ వేదికగా అమల్లోకి వచ్చింది. తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గంలోని ముక్కావారిపల్లెలో ఈ చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కలిసి ఒక ఫారమ్ పాండ్, పంట కుంట నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గ్రామీణ ప్రజల అభ్యున్నతితోపాటు రైతుల ఆర్థికాభివృద్ధి కోసం ఈ సరికొత్త పథకంలో ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు నేతలు స్పష్టం చేశారు. (5లో..)

## నాడు మూడు ముక్కలాట.. నేడు మావిగన్

- అమరావతిపై జగన్ తీరుపై ఆగ్రహం
- కుట్రలను ఛేదించి రాజధాని నిర్మాణం
- నాడు మద్దతు... నేడు మాట మార్పు
- వైసీపీ తీరును ఎండగట్టిన చంద్రబాబు

# చదువుకుంటూనే సంపాదన!

- శ్రీసిటీ ఇంటర్నేషనల్ వర్సిటీ ప్రారంభం
- లోకేశ్ చేతుల మీదుగా శ్రీకారం



విద్యార్థులు చదువుకుంటూనే నైపుణ్యాలు సాధిస్తూ సంపాదించే వినూత్న వర్క్‌స్టడీ డ్యుయల్ మోడల్ విశ్వవిద్యాలయం 'శ్రీసిటీ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ' (ఎస్ఐయూ)ని రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేశ్ గురువారం ప్రారంభించారు. దేశంలో ఏటా పట్టభద్రులవుతున్న లక్షలాది మంది యువతలో నైపుణ్య లోటు కనిపిస్తున్న నేపథ్యంలో, ఈ సరికొత్త విద్యావిధానానికి శ్రీకారం చుట్టారు. ఇది ఒక నాన్ ప్రాఫిటబుల్ విద్యాసంస్థగా సేవలందించనుంది. (వివరాలు 5లో..)



## క్రాంతికుమార్ కుటుంబానికి జగన్ పరామర్శ

**బాధిత కుటుంబానికి అంగడా ఉంటానన్న వైసీపీ అధినేత**

పోలీసుల వేధింపులు తాళలేక సెల్ఫీ వీడియో రికార్డు చేసి ఆత్మహత్య చేసుకున్న టాక్సీ డ్రైవర్ క్రాంతికుమార్ కుటుంబాన్ని వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పరామర్శించారు. విజయవాడ కృష్ణలంకలోని వారి నివాసానికి వెళ్లిన ఆయన, మృతుడి భార్య, పిల్లలు, తండ్రిని ఓదార్చారు. గత మూడు నెలలుగా కృష్ణలంక మాజీ సీఐ నాగరాజు, ఇతర పోలీసులు క్రాంతికుమార్‌ను స్టేషన్‌కు పిలిపించి ఏ విధంగా మానసికంగా, శారీరకంగా హింసించారో కుటుంబ సభ్యులు జగన్‌కు వివరిస్తూ కన్నీరుమున్నీరయ్యారు. (వివరాలు 5లో..)



# ఈ చరిత్ర ఇంకెన్నాళ్లు..!

**ఏ సిరాతో రాయాలి... నీ నిర్లక్ష్యపు హిస్టరీ ?**

**శభాష్... వార్డెన్ హేమా..!**


రాళ్లబాటలో నడకతోనా... రగులుతున్న హృదయ ఘోషతోనా... దేశమా... రాష్ట్రమా... రాజకీయమా... మౌనం వీడవా...? కొన్ని వార్తలు వార్తలుగా ముగిసిపోవు. అవి మనసును వెంటాడే ప్రశ్నలుగా మిగిలిపోతాయి. మరికొన్ని సంఘటనలు కేవలం ఒక వ్యక్తి చేసిన గొప్ప పనిని మాత్రమే చెప్పవు... ఒక వ్యవస్థ ఎక్కడ విఫలమైందో అద్దంలా చూపిస్తాయి. మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం గిరిజన ప్రాంతంలో జరిగిన ఈ ఘటన కూడా అలాంటిదే. తీవ్ర జ్వరంతో బాధపడుతున్న ఒక గిరిజన విద్యార్థినిని ఆసుపత్రికి చేర్చేందుకు, రోడ్డు లేక ఆరు కిలోమీటర్ల రాళ్ల దారిలో భుజాలపై మోసుకెళ్లిన వార్డెన్ హేమ కథ, మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం. అదే సమయంలో అభివృద్ధి గురించి మనం చెప్పుకునే గొప్ప కథనాలకు ఎదురుగా నిలిచే చేదు వాస్తవం. (వివరాలు 7లో..)

## తిరుచ్చి బరిలో త్రిష?

- ఇక పొలిటికల్ స్క్రీన్‌పైకి నటి
- రంగం సిద్ధం చేస్తున్న విజయ్
- పాలనలో సహాయం కోసమేనా?
- తమిళనాడులో ఆసక్తికర చర్చ

తమిళనాడు రాజకీయాల్లో ప్రస్తుతం ఒక ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. కోలీవుడ్ స్టార్ హీరోయిన్ త్రిష త్వరలోనే ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టబోతున్నారనే వార్తలు బలంగా వినిపిస్తున్నాయి. తిరుచ్చి నియోజకవర్గానికి జరగబోయే ఉపఎన్నికలో ఆమె అధికార పార్టీ తరఫున పోటీ చేసే అవకాశం ఉందనే ప్రచారం జోరందుకుంది. ఈ వార్త ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద సంచలనంగా మారింది. (7లో..)





## వందకు చేరువవుతుందా?

**డాలర్ ధాటికి రూపాయి పతనం**

**రోజు రోజుకు తగ్గుతున్న స్వదేశీ కరెన్సీ**

రూపాయి ప్రారంభ లాభాలను కోల్పోయి గురువారం అమెరికా డాలర్‌తో పోలిస్తే 18 పైసలు క్షీణించి 95.34 వద్ద ముగిసింది. ముడిచమురు ధరలు తగ్గినప్పటికీ.. దిగుమతిదారులు, కార్పొరేట్ సంస్థల నుండి డాలర్లకు విపరీతంగా డిమాండ్ పెరగడం రూపాయి విలువను దెబ్బతీసింది. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్లో రూపాయి 94.95 వద్ద బలంగానే ప్రారంభమైంది. ట్రేడింగ్ సమయంలో 94.90 నుండి 95.40 మధ్య ఊగిసలాడిన కరెన్సీ.. చివరకు మునుపటి ముగింపుతో పోలిస్తే నష్టాల్లో ముగిసింది. బుధవారం కూడా రూపాయి ఏకంగా 60 పైసలు క్షీణించిన సంగతి తెలిసిందే. (7లో..)


## వాట్సాప్ యూజర్‌నేమ్స్ వివాదం

**ప్రముఖుల పేర్ల దుర్వినియోగమని ఫేక్ ప్రచారం**

**తప్పుడు వార్తలను నమ్మొద్దన్న మెటా**

ప్రముఖ వ్యక్తుల పేర్లతో ఇతరులు వాట్సాప్ యూజర్‌నేమ్స్ రిజర్వ్ చేసుకుంటున్నారనే ప్రచారాలను మెటా యాజమాన్యంలోని వాట్సాప్ సంస్థ పూర్తిగా ఖండించింది. ఈ తరహా ఆరోపణలు కేవలం తప్పుడు ప్రచారాలు మాత్రమేనని స్పష్టం చేసింది. ప్రముఖులు, ప్రభుత్వ సంస్థలు, సెలబ్రిటీల పేర్లను కేవలం వారి అసలైన యజమానులు మాత్రమే తీసుకునేలా ప్రత్యేక రక్షణ చర్యలు ఏర్పాటు చేసినట్లు సంస్థ తెలిపింది. (5లో..)





## పూణె హత్య కేసులో కొత్త ట్విస్ట్

**టెక్నాలజీ ఆధారంగా విచారణ**

**గేట్ అనాలిసిస్ శాస్త్ర వినియోగం**

**కేతన్ హత్య కేసు మిస్టరీపై సస్పెన్స్**

**నేరస్థులను పట్టించే నడక రహస్యం**

పూణె కోర్టు కేతన్ అగర్వాల్ హత్య కేసులో నిందితులైన సియా గోయల్, చేతన్ చౌదరిల పోలీసు కస్టడీని జూలై 3, 2026 వరకు పొడిగించింది. ఈ కేసులో అనేక కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని దర్యాప్తు అధికారులు న్యాయస్థానానికి తెలిపారు. నిందితుడు చేతన్ చౌదరి నడక తీరుపై ఫోరెన్సిక్ అధ్యయనం నిర్వహించాల్సిన అవసరం ఉందని పోలీసులు పేర్కొన్నారు. లోహగఢ్ కోట సమీపంలో నేరం జరిగిన ప్రదేశంలో తలపై హుడీ ధరించిన ఒక వ్యక్తి తిరుగుతున్నట్లు సీసీటీవీ దృశ్యాలు లభించాయి. ఆ దృశ్యాల్లో ఉన్న వ్యక్తి చేతన్ చౌదరి అవునో కాదో నిర్ధారించడానికి అతని నడక తీరును విశ్లేషించాలని పోలీసులు నిర్ణయించారు. (వివరాలు 7లో..)

## సంగీత సమరం

**ఇళయరాజాకు ఢిల్లీ హైకోర్టులో భారీ షాక్**

**ప్రముఖ మ్యూజిక్ సంస్థతో కాపీరైట్ వివాదం**



7లో..



5లో..

## కోర్టుల్లో నకిలీ తీర్పుల కలకలం

**సుప్రీంకోర్టు సంచలన తీర్పు**

**ఏఐ తీర్పులపై న్యాయస్థానం ఆగ్రహం**

## భారత్ జపాన్ కొత్త కూటమి

**అంతర్జాతీయ రాజకీయాల్లో సంచలనం**

**రక్షణ ఆర్థిక రంగాల్లో వ్యూహాత్మక అడుగులు**



7లో..



# క్రాంతికుమార్ కుటుంబానికి జగన్ పరామర్శ

### బాధిత కుటుంబానికి అండగా ఉంటానన్న వైసీపీ అధినేత

పోలీసుల వేధింపులు తాళలేక సెల్ఫీ వీడియో రికార్డు చేసి ఆత్మహత్య చేసుకున్న టాక్సీ డ్రైవర్ క్రాంతికుమార్ కుటుంబాన్ని వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పరామర్శించారు. విజయవాడ కృష్ణలంకలోని వారి నివాసానికి వెళ్లిన ఆయన, మృతుడి భార్య, పిల్లలు, తండ్రిని ఓదార్చారు. గత మూడు నెలలుగా కృష్ణలంక మాజీ సీఐ నాగరాజు, ఇతర పోలీసులు క్రాంతికుమార్‌ను స్టేషన్‌కు పిలిపించి ఏ విధంగా మానసికంగా, శారీరకంగా హింసించారో కుటుంబ సభ్యులు జగన్‌కు వివరిస్తూ కన్నీరుమున్నీరయ్యారు.

**దిగజారిన పోలీస్ వ్యవస్థ**

క్రాంతికుమార్ కుటుంబం కడు పేదరికంలో ఉందన్న జగన్, ఒక అమాయకుడిని వేధించి వారి సంసారాన్ని రోడ్డున పడేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ ఎంతగా దిగజారిపోయిందో చెప్పడానికి ఈ ఘటనే నిదర్శనమన్నారు. క్రాంతికుమార్ తన మరణ వాంగ్మూలంలో పోలీసుల అక్రమాలను క్లియర్ గా వివరించినా, ఇప్పటివరకు బాధ్యులపై ఎలాంటి కేసు నమోదు చేయకపోవడం దారుణమన్నారు. రాజధాని నగరంలో ముఖ్యమంత్రి నివాసం, డీజీపీ కార్యాలయాల కూతవేటు దూరంలో ఇంత పెద్ద దారుణం జరిగినా ఉన్నతాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక పెద్దల రక్షణ ఉందని ఆరోపించారు.

**సీసీటీవీ ఫుటేజ్ మాయం**

కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో నెల రోజుల వ్యవధిలో ఒక లాకప్ డెత్, ఒక ఆత్మహత్య జరగడం కలకలం రేపుతోందని జగన్ పేర్కొన్నారు. స్టేషన్లలోని సీసీటీవీ ఫుటేజ్‌లను ఒక పద్ధతి ప్రకారం మాయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. నెల రోజుల బ్యాకప్ లేదని కొందరు, 18 నెలలుగా కెమెరాలు పనిచేయడం లేదని మరికొందరు రిపోర్టుల్లో రాయడం వెనుక స్టేషన్లలో జరుగుతున్న చట్టవిరుద్ధ పనులను దాచే కుట్ర దాగి ఉందన్నారు. సాక్ష్యాలను చెత్తబుట్టలో వేస్తూ అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నారని మండిపడ్డారు.

**న్యాయపోరాటానికి సిద్ధం**

బాధిత కుటుంబానికి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు కింద న్యాయం చేయాలని జగన్ డిమాండ్ చేశారు. క్రాంతికుమార్ కుటుంబానికి పార్టీ తరఫున పూర్తి ఆర్థిక, న్యాయ సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు అవసరమైతే కోర్టుల ద్వారా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. వ్యవస్థలు అధికార పక్షానికి, ప్రతిపక్షానికి సమానంగా రూల్స్ వర్తింపజేసినప్పుడే సమాజంలో సమతుల్యత ఉంటుందని జగన్ హితవు పలికారు.

# అమర్‌నాథ్ హిమలింగ దర్శన యాత్ర ప్రారంభం!

### తొలి భక్త బృందానికి చందర్‌కోట్ వద్ద ఘన స్వాగతం



హిమాలయాల్లో వెలిసిన పవిత్ర అమర్‌నాథ్ హిమలింగ దర్శన యాత్ర వైభవంగా ప్రారంభమైంది. క్షేత్ర దర్శనానికి బాల్తాల్ రూట్‌లో వెళ్తున్న భక్తుల తొలి బృందానికి జమ్మూ శ్రీనగర్ జాతీయ రహదారిపై ఉన్న చందర్‌కోట్ వద్ద ఘన స్వాగతం లభించింది. రాంబన్ జిల్లా యంత్రాంగం, సివిల్ సొసైటీ సభ్యులు భక్తులకు ఆత్మీయ ఆతిథ్యం ఇచ్చారు. అంతకుముందు జమ్మూలోని భగవతీ నగర్ బేస్ క్యాంప్ నుంచి లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఈ యాత్ర కాన్వాయ్‌ను జెండా ఊపి ప్రారంభించారు. పవిత్ర యాత్ర సురక్షితంగా సాగేందుకు యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టింది. చందర్‌కోట్ లంగర్ సైట్ వద్ద భక్తులకు అవసరమైన వసతులు, భోజన సదుపాయాలను సిద్ధం చేశారు. పోలీస్, ఆర్మీ, సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్, ఆరోగ్య శాఖ వంటి అన్ని విభాగాలు సమన్వయంతో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నాయి.

# పల్లె ప్రగతికి నూతన శకం!

- అమలులోకి వీబీజీరాంజీ పథకం
- రూపురేఖలు మారనున్న గ్రామీణ ప్రాంతాలు
- ప్రారంభించిన కేంద్ర మంత్రి, సీఎం, డిప్యూటీ సీఎం
- వీబీజీ రాంజీతో రాష్ట్రాలకు రూ.7.5 లక్షల కోట్ల కేంద్ర నిధులు
- ప్రతీ గ్రామ పంచాయితీకి ఏడాదికి రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు
- పథకం భారం కాదు బాధ్యతన్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- తోతాపురి మామిడి కొనుగోళ్లకు కేంద్ర మంత్రి చౌహాన్ హామీ

. 125 రోజుల పని దినాలతో గ్రామీణ అభివృద్ధికి అవసరమైన రహదారులు, డ్రైనేజీలు, కాలువలు లాంటి శాశ్వత ఆస్తుల కల్పనకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు.

**సాంకేతికతతో పారదర్శక పాలన**

ఈ పథకం అమలులో జియో ట్యాగింగ్, బయోమెట్రిక్ లాంటి అత్యాధునిక సాంకేతికతను ఉపయోగిస్తూ పూర్తి పారదర్శకత పాటిస్తామని ముఖ్యమంత్రి వివరించారు. రాబోయే రోజుల్లో గాలేరు నగరి నుంచి కోడూరుకు నీళ్లు తీసుకువస్తామని, జలధార ద్వారా భూగర్భ జలాలను పెంచుతామని హామీ ఇచ్చారు. రాష్ట్రాలు వ్యయం చేసేలా ఈ పథకాన్ని చేపట్టడం భారం కాదని, అదొక సామాజిక బాధ్యతని చంద్రబాబు అభివర్ణించారు. 13,226 గ్రామాల్లో ఒకేసారి గ్రామసభలు నిర్వహించి గిన్నిస్ రికార్డు సృష్టించిన ఘనత పవన్ కల్యాణ్‌కే దక్కుతుందని కొనియాడారు. ఇప్పటికే 7,000 కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు, 40 వేల గోకులాలు, లక్షకు పైగా ఫార్మ్ పాండ్లు నిర్మించామని చెప్పారు. ఈ ఏడాది మరో 10 వేల కిలోమీటర్ల గ్రావెల్ రోడ్లు, 1,500 కిలోమీటర్ల సిమెంట్, బీటీ రోడ్లు నిర్మిస్తామని ప్రకటించారు. పొలాలకు వెళ్లే డొంక రోడ్లను కూడా ఈ పథకం కింద నిర్మించవచ్చని స్పష్టం చేశారు.

**రాయలసీమను అగ్రస్థానంలో నిలుపుతాం**

గత పాలకులు నిర్వీర్యం చేసిన 93 కేంద్ర ప్రాయోజిత పథకాలను కూటమి ప్రభుత్వం పునరుద్ధరించిందని చంద్రబాబు నాయుడు వెల్లడించారు. అమరావతి రాజధాని నిర్మాణం వేగంగా జరుగుతోందని, దానిని ఆపడం ఎవరి తరమూ కాదని స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టును గోదావరి పుష్కరాల కంటే ముందే పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ను నిలబెట్టడంతో పాటు రైల్వే జోన్ సాధించామని చెప్పారు. గూగుల్ డేటా సెంటర్, పుట్టపర్తిలో ఫైటర్ జెట్ తయారీ యూనిట్ వస్తున్నాయని, రాయలసీమను అన్ని రంగాల్లోనూ అగ్రస్థానంలో నిలుపుతామని హామీ ఇచ్చారు. త్వరలోనే రూ.40 వేల కోట్ల ప్రభుత్వ పెట్టుబడులు, రూ.60 వేల కోట్ల ప్రైవేటు పెట్టుబడులు తీసుకువస్తామని, తిరుపతిలో బుల్లెట్ మోటార్ సైకిల్ తయారీ ప్లాంట్ రాబోతుందని ప్రకటించారు. స్వర్ణాంధ్ర ప్రదేశ్ లక్ష్య సాధనలో ప్రజలంతా నిస్వార్థంగా పనిచేసే కూటమి నేతలకు సహకరించాలని కోరారు.



**ఆంధ్రప్రదేశ్‌కు నేను మేనమామను**

కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ దేశంలోని గ్రామాలను ప్రగతి పథంలో నడిపించేందుకే వీబీజీ రామ్ జీ కింద రూ.7.5 లక్షల కోట్లు వ్యయం చేయాలని నిర్ణయించామని చెప్పారు. రాబోయే 9 నెలల కాలానికి ఈ పథకం కింద ఏపీకి కేంద్రం నుంచి రూ.7,700 కోట్లు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. మధ్యప్రదేశ్‌లో తనను అందరూ 'మామాజీ' అని పిలుస్తారని, ఇప్పుడు ఏపీ ప్రజలకు కూడా తాను మేనమామను అయ్యానని ఆత్మీయంగా వ్యాఖ్యానించారు. ఏ మేనమామ కూడా ఖాళీ చేతులతో రాడని చెప్తూ, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద ఏపీకి 74,212 పక్కా ఇళ్లు, గ్రామీణ రోడ్ల నిర్మాణానికి రూ.422 కోట్ల నిధుల పత్రాలను సీఎం, డిప్యూటీ సీఎంలకు అందజేశారు.

**రైతులకు కేంద్ర ప్రభుత్వం అండ**

తోతాపురి మామిడి రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రకటించారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద 2,16,250 మెట్రిక్ టన్నుల తోతాపురి మామిడిని కేంద్రమే నేరుగా కొనుగోలు చేస్తుందని స్పష్టం చేస్తూ దానికి సంబంధించిన పత్రాలను సీఎం చంద్రబాబుకు అందజేశారు. ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా పూర్తి సహకారం అందిస్తుందని, ఎక్కడా చేయి విడిచిపెట్టే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ తమ పుట్టిన రోజున కనీసం ఒక మొక్క నాటాలని పిలుపునిచ్చారు.

# ఏపీ వేదికగా దేశవ్యాప్త విప్లవం

- పంట కుంటతో శుభారంభం
- అమలుల్లోకి వీబీజీరాంజీ
- వుడ్ బ్యాంకులతో పంచాయతీల బలోపేతం



ఈ పథకం కింద కలప ఉత్పత్తిని పెంచేందుకు టేకు, మద్ది, వేప, యూకలిప్టస్ వంటి పది రకాల మేలురకం మొక్కలను ప్రముఖులు నాటారు. పచ్చదనం పెంపుతో పర్యావరణాన్ని రక్షించడమే కాకుండా, గ్రామ పంచాయతీల ఆదాయాన్ని పెంచేందుకు పవన్ కళ్యాణ్ ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశారు. కలప ఉత్పత్తిని ప్రోత్సహిస్తూ వుడ్ బ్యాంకుల ఏర్పాటుకు ఈ ప్రణాళికలో పెద్ద పీట వేశారు. ఇందుకు సంబంధించిన సమగ్ర వివరాలను రాష్ట్ర నాయకత్వం కేంద్ర మంత్రికి వివరించింది.

**మ్యాజిక్ డ్రెయిన్‌తో మురుగునీటి నిర్వహణ**

మురుగునీటి నిర్వహణ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకువచ్చిన వినూత్న ఆవిష్కరణ 'మ్యాజిక్ డ్రెయిన్' నమూనాను కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు అధికారులు ప్రదర్శించారు. మూడు లేయర్ల ప్రత్యేక సాంకేతికతతో ఈ డ్రెయిన్ నిర్మిస్తున్నారు. మొదటి లేయర్‌లో 100 ఎంఎం కంకర, రెండో లేయర్‌లో 40 ఎంఎం కంకర, మూడో లేయర్‌లో 20 ఎంఎం కంకరతో దీనిని ఏర్పాటు చేస్తారు. ఈ వినూత్న విధానం పారిశుద్ధ్య నిర్వహణలో కీలక మార్పులు తీసుకురానుంది.

**పారదర్శకతకు పెద్ద పీట**

ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖ సాధించిన విజయాలతో ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీని అతిథులు సందర్శించారు. మోడల్ పంచాయతీలు, జియో ట్యాగింగ్ వంటి పారదర్శక విధానాల ద్వారా సాధించిన ప్రగతిని వారు అభినందించారు. అనంతరం వీబీజీ రాంజీ శిలాఫలకాన్ని ఆవిష్కరించి, ఉపాధి శ్రామికులకు కొత్త కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నాడు మూడు ముక్కలాట.. నేడు మావిగన్

- అమరావతిపై జగన్ తీరుపై ఆగ్రహం
- కుట్రలను ఛేదించి రాజధాని నిర్మాణం
- నాడు మద్దతు... నేడు మాట మార్పు
- వైసీపీ తీరును ఎండగట్టిన చంద్రబాబు

రాష్ట్ర ప్రజలందరి భవిష్యత్తుకు అవసరమైన ఏకైక రాజధాని అమరావతి అని, కానీ గొడ్డలి పార్టీకి అది అవసరం లేదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గతంలో హైదరాబాద్‌లో నిర్వహించిన అసెంబ్లీ సమావేశాల్లో రాజధానిగా అమరావతికి తాము పూర్తి మద్దతు ఇస్తున్నామని వైఎస్ జగన్ స్వయంగా ప్రకటించారని గుర్తు చేశారు. ఆ నమ్మకంతోనే అమరావతి ప్రాంతానికి చెందిన 29 వేల మంది రైతులు సుమారు 33 వేల ఎకరాల తమ అమూల్యమైన భూములను ల్యాండ్ పూలింగ్ ద్వారా ప్రభుత్వానికి స్వచ్ఛందంగా అప్పగించారని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**• రాజధానిపై కుట్రల పర్వం**

రాష్ట్ర ప్రగతిని దెబ్బతీసేందుకు గత పాలకులు అనేక అక్రమాలకు పాల్పడ్డారని చంద్రబాబు నాయుడు ఆరోపించారు. అమరావతిని దెబ్బతీయడానికి సొంత చెరుకు తోటలకు వారే నిప్పు పెట్టుకుని, ఆ నెపాన్ని ప్రభుత్వంపై నెడుతూ కుట్రలు చేశారని మండిపడ్డారు. సొంత బాబాయిని గొడ్డలితో దారుణంగా చంపి, ఆపై ఆ నిందను నాపై వేయడానికి ప్రయత్నించిన వారికి ఇటువంటి అరాచకాలు చేయడం, నేరాలకు పాల్పడటం పెద్ద కష్టమేమీ కాదని ముఖ్యమంత్రి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజల రాజధాని అమరావతిని నిర్మించి తీరుతామని ఆయన తేల్చి చెప్పారు.

# కోర్టుల్లో నకిలీ తీర్పుల కలకలం

- సుప్రీంకోర్టుసంచలనతీర్పు
- ఏఐ తీర్పులపై న్యాయస్థానం ఆగ్రహం

న్యాయ ప్రక్రియలో ఉనికిలో లేని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సృష్టించిన నకిలీ (హాలూసినేటెడ్) తీర్పులను ఉపయోగించడం అత్యంత ప్రమాదకరమని సుప్రీంకోర్టు హెచ్చరించింది. నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్టీ) ఇచ్చిన ఒక ఉత్తర్వును సుప్రీంకోర్టు గురువారం రద్దు చేసింది. ఆ ట్రిబ్యునల్ తన తీర్పులో కొన్ని కల్పిత ఏఐ కేసులను ఆధారంగా చేసుకున్నట్లు సుప్రీంకోర్టు గుర్తించింది. జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన ధర్మాసనం ఈ కీలక నిర్ణయాన్ని ప్రకటించింది. స్వతంత్రంగా తనిఖీ చేయకుండా ఏఐ ఆధారిత పాత తీర్పులను నమ్మడంపై కోర్టులు 'జీరో టాలరెన్స్'... సహించేది లేదనే విధానాన్ని అవలంబించాలని స్పష్టం చేసింది.

**న్యాయ సూత్రాలకు ఏఐ పెద్ద ముప్పు**

ఆధునిక కాలంలో పనిభారం పెరగడం వల్ల న్యాయవాదులు, న్యాయమూర్తులు తమ సామర్థ్యాన్ని పెంచుకోవడానికి కృత్రిమ మేధస్సును ఆశ్రయిస్తున్నారని కోర్టు అంగీకరించింది. అయితే న్యాయ నిర్ణయ ప్రక్రియలోని ప్రతి దశలోనూ మానవ పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని ధర్మాసనం నొక్కి చెప్పింది. చట్టంలో ఇలాంటి నకిలీ సమాచారాన్ని ఉపయోగించడం అనేది భోపాల్ గ్యాస్ దురంతంలో మిథైల్ ఐసోసైనేట్ గ్యాస్ విడుదలైనంత ప్రమాదకరమని న్యాయమూర్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇది కనిపించకుండా న్యాయ వ్యవస్థను నాశనం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

**కోర్టుల్లో కృత్రిమ మేధస్సు వాడకానికి కొత్త నిబంధనలు**

న్యాయస్థానాలలో ఏఐ సాంకేతికతను జాగ్రత్తగా ఉపయోగించడానికి 'కోర్టులలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగ కరదు నిబంధనలు 2026' పేరుతో ప్రజా సంప్రదింపుల కోసం డ్రాఫ్ట్ సిద్ధం చేసినట్లు కోర్టు తెలిపింది. ఈ నిబంధనల ప్రకారం ఏఐ వ్యవస్థలు కేవలం సహాయక పాత్రలో మాత్రమే పనిచేయాలి. అవి ఎట్టి పరిస్థితుల్లోనూ న్యాయమూర్తుల స్థానాన్ని భర్తీ చేయకూడదు. పిటిషన్లలో ఏఐ సహాయం తీసుకుంటే ఆ విషయాన్ని ముందుగానే వెల్లడించాలి. శిక్షలు ఖరారు చేయడం, బెయిల్ మంజూరు లేదా తిరస్కరణ వంటి కీలక నిర్ణయాల్లో ఏఐ వాడకాన్ని పూర్తిగా నిషేధించారు.

**బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు**

యంత్రాలపై మితిమీరిన ఆధారపడటం వల్ల మానవ ఆలోచనా శక్తి దెబ్బతింటుందని న్యాయమూర్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆలోచించే సామర్థ్యం కేవలం క్రమశిక్షణతో కూడిన మానసిక శిక్షణ ద్వారానే లభిస్తుందని గుర్తుచేశారు. కోర్టుల ముందుకు ఇలాంటి నకిలీ తీర్పులు రాకుండా అడ్డుకోవడానికి తగిన నిబంధనలను రూపొందించాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ సమస్యను అత్యంత తీవ్రంగా పరిగణించి, నిబంధనలను ఉల్లంఘించే వారిపై ఎలాంటి క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలో స్పష్టమైన మార్గదర్శకాలను ఖరారు చేయడానికి ఒక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించింది.

**రూ.200 కోట్ల లోన్ వివాదంలో ట్రిబ్యునల్స్ పొరపాట్లు**

ఎసెల్ ఇన్‌ఫ్రాప్రాజెక్ట్స్ లిమిటెడ్ సస్పెండ్ అయిన డైరెక్టర్ పూజా రమేష్ సింగ్ దాఖలు చేసిన అప్పీల్‌ను సుప్రీంకోర్టు విచారించింది. జమ్మూ కాశ్మీర్ బ్యాంక్ ఇచ్చిన రూ.200 కోట్ల లోన్ డిఫాల్ట్ కేసులో ఎన్‌సిఎల్‌టి కంపెనీపై దివాలా ప్రక్రియకు అనుమతించింది. అయితే ఈ ఉత్తర్వులో ఎన్‌సిఎల్‌టి కల్పిత తీర్పులను వాడిన విషయాన్ని నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్ గమనించకపోవడంపై



సుప్రీంకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. లాయర్లు సమర్పించే కేసులను స్వయంగా సరిచూసుకోకుండా కోర్టులు గుడ్డిగా నమ్మకూడదని హెచ్చరించింది.

**నిజాలను నిర్ధారించుకోని ట్రిబ్యునల్ ఉత్తర్వుల రద్దు**

జమ్మూ కాశ్మీర్ బ్యాంక్ ఈ విషయమై కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. తమ లాయర్లు ఆ నకిలీ తీర్పులను కోర్టుకు సమర్పించలేదని, ఎన్‌సిఎల్‌టి తన స్వంత పరిశోధన ద్వారా వాటిని సేకరించిందని పేర్కొంది. అయితే తప్పు ఎక్కడి నుండి జరిగినా అది న్యాయ ప్రక్రియ సమగ్రతను దెబ్బతీస్తుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అందుకే ఎన్‌సిఎల్‌టి, ఎన్‌సిఎల్‌ఎటి ఇచ్చిన రెండు ఉత్తర్వులను పక్కన పెడుతున్నట్లు ప్రకటించింది. చట్టప్రకారం ఈ కేసును మళ్లీ కొత్తగా విచారించాలని ట్రిబ్యునల్‌కు కేసును తిరిగి పంపించింది.

# చదువుకుంటూనే సంపాదన!

### శ్రీసిటీ ఇంటర్నేషనల్ వర్సిటీ ప్రారంభం

### లోకేశ్ చేతుల మీదుగా శ్రీకారం

విద్యార్థులు చదువుకుంటూనే నైపుణ్యాలు సాధిస్తూ సంపాదించే వినూత్న వర్క్‌స్టడీ డ్యుయల్ మోడల్ విశ్వవిద్యాలయం 'శ్రీసిటీ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ' (ఎస్ఐయూ)ని రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేశ్ గురువారం ప్రారంభించారు. దేశంలో ఏటా పట్టభద్రులవుతున్న లక్షలాది మంది యువతలో నైపుణ్య లోటు కనిపిస్తున్న నేపథ్యంలో, ఈ సరికొత్త విద్యావిధానానికి శ్రీకారం చుట్టారు. ఇది ఒక నాన్ ప్రాఫిటబుల్ విద్యాసంస్థగా సేవలందించనుంది.

**స్టైపెండ్‌తో కూడిన పని అనుభవం**

ఈ విధానంలో విద్యార్థులు తమ స్టడీలో మూడోవంతు సమయం క్యాంపస్‌లో చదివి, మిగిలిన సమయం పరిశ్రమల్లో ఇంటర్న్‌షిప్ చేస్తారు. మొదటి ఏడాది నుంచే నెలకు కనీసం పదివేల రూపాయల స్టైపెండ్ అందుతుంది. కోర్సు ముగిసేసరికి రెండేళ్లకు పైగా వాస్తవ పని అనుభవం లభిస్తుంది. ఏఐ, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కోర్సులు ఉంటాయి. క్యాంపస్‌లో స్టార్టప్స్ కోసం 'స్టేషన్ ఎస్' ఇంక్యుబేషన్ సెంటర్ కూడా ఏర్పాటు చేశారు. బిటెక్, బిబిఏ కోర్సుల్లో 202627 విద్యాసంవత్సరానికి ప్రవేశాలు ప్రారంభమయ్యాయి.

**నైపుణ్యమే అసలు సమస్యన్న శ్రీనిరాజు**

మనదేశంలో ఏటా కోటి మందికి పైగా సాంప్రదాయ డిగ్రీలతో బయటకు వస్తున్నా, వారిలో 50 శాతానికి పైగా ఉపాధికి సరిపడా స్కిల్స్ లేవని శ్రీసిటీ చైర్మన్ శ్రీనిరాజు పేర్కొన్నారు. శ్రీసిటీ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ప్రారంభోత్సవ సభలో ఆయన మాట్లాడారు. నైపుణ్యాలు లేకపోవడం వల్ల యువత నుంచి ఆశించిన ఉత్పాదకత లభించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. యువతలోని ఈ స్కిల్ గ్యాప్‌ను భర్తీ చేసేందుకే అంతర్జాతీయ



ప్రమాణాలతో విద్యాసంస్థను ఏర్పాటు చేసినట్లు శ్రీనిరాజు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు విద్యార్థులకు వంద శాతం ఉపాధి లభించేలా ఈ వర్సిటీని తీర్చిదిద్దామన్నారు. విదేశాల తరహాలో ఇక్కడ వర్క్ స్టడీ మోడల్, ఇంక్యుబేషన్ సెంటర్ అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో ఎండి రవీంద్ర సన్నారెడ్డి, పారిశ్రామికవేత్త ప్రవీణ్ అక్కిరాజు పాల్గొన్నారు.

# వాట్సాప్ యూజర్‌నేమ్స్ వివాదం

### ప్రముఖుల పేర్ల దుర్వినియోగమని

### ఫేక్ ప్రచారం

### తప్పుడు వార్తలను నమ్మొద్దన్న మెటా

ప్రముఖ వ్యక్తుల పేర్లతో ఇతరులు వాట్సాప్ యూజర్‌నేమ్స్ రిజర్వ్ చేసుకుంటున్నారనే ప్రచారాలను మెటా యాజమాన్యంలోని వాట్సాప్ సంస్థ పూర్తిగా ఖండించింది. ఈ తరహా ఆరోపణలు కేవలం తప్పుడు ప్రచారాలు మాత్రమేనని స్పష్టం చేసింది. ప్రముఖులు, ప్రభుత్వ సంస్థలు, సెలబ్రిటీల పేర్లను కేవలం వారి అసలైన యజమానులు మాత్రమే తీసుకునేలా ప్రత్యేక రక్షణ చర్యలు ఏర్పాటు చేసినట్లు సంస్థ తెలిపింది. ఇటీవల కొందరు ప్రముఖులు తమ పేర్లతో ఉన్న యూజర్‌నేమ్స్ అప్పుడే వేరొకరు తీసుకున్నారని సోషల్ మీడియా వేదికగా ఆందోళన వ్యక్తం చేయడంతో వాట్సాప్ ఈ వివరణ ఇచ్చింది.

**కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నోటీసులతో పెరిగిన ఆందోళన**

వాట్సాప్ తీసుకురావాలని భావిస్తున్న ఈ కొత్త ఫీచర్ ద్వారా ఆన్‌లైన్ మోసాలు, ఫిషింగ్, డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లు పెరిగే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది.


**వినియోగదారుల రక్షణ కోసం బహుళ అంచెల భద్రత**

ఈ యూజర్‌నేమ్ ఫీచర్ ఇంకా పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాలేదని, ఈ ఏడాది చివర్లో నెమ్మదిగా విడుదల చేస్తామని వాట్సాప్ ప్రతినిధి ఒకరు తెలిపారు. నకిలీ ఖాతాలను నిరోధించడానికి మెటా వెరిఫైడ్ ఖాతాల పేర్లను ముందే బ్లాక్ చేసి ఉంచామని చెప్పారు. ఒక వ్యక్తిని కాంటాక్ట్ చేయాలంటే వారి ఖచ్చితమైన యూజర్‌నేమ్ తెలిసి ఉండాలని, అలాగే గుర్తుతెలియని వ్యక్తులు పదే పదే వేర్వేరు పేర్లను వెతకకుండా కఠినమైన పరిమితులు విధిస్తున్నామని సంస్థ వివరించింది.



**కొత్త మెసేజ్‌ల విషయంలో అప్రమత్తత అవసరం**

భవిష్యత్తులో ఈ ఫీచర్ అందుబాటులోకి వచ్చినప్పుడు ఎవరైనా కొత్త వ్యక్తి మొదటిసారి మెసేజ్ పంపితే సదరు ఖాతాకు సంబంధించిన పూర్తి వివరాలను వాట్సాప్ చూపిస్తుంది. అది కొత్త అకౌంటా, మీ కాంటాక్ట్ లిస్ట్‌లో ఉందా, మీ ఇద్దరికీ కామన్ గ్రూపులు ఏమైనా ఉన్నాయా, లేదా అవతలి వ్యక్తి వేరే దేశానికి చెందినవాడా అనే విషయాలను ముందే తెలియజేస్తుంది.

అవిగో.. 2029కి అజెండా సెట్ అయిపోయింది. అమరావతికి చట్టబద్ధత ముద్ర పడి కథ ముగిసిందనుకున్న వేళ.. ఏపీ రాజకీయ యవనికపై "స్టాండ్ విత్ మావిగన్" అంటూ జగన్ మోహన్ రెడ్డి విసిరిన సరికొత్త అస్త్రం రాష్ట్ర రాజకీయాలను ఒక్కసారిగా షేక్ చేసింది. ఇది కేవలం ఒక నినాదం కాదు.. అమరావతి సామ్రాజ్యానికి ఎదురుగా నిలబెట్టిన ప్రాంతీయ వికేంద్రీకరణ సిద్ధాంతం! కూటమి సర్కార్ అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా చూపించి ఓట్లు అడుగుతుంటే.. జగన్ మాత్రం 'మావిగన్' నినాదంతో సరికొత్త వ్యూహాత్మక అజెండాను సెట్ చేశారు. ఇది రాజకీయ లబ్ధి కోసం వేసిన మైండ్ గేమా? లేక వెనుకబడిన ప్రాంతాల ఆత్మగౌరవ పోరాటమా? ఓటరు దేవుడు అభివృద్ధి వైపు నిలబడతాడా.. వికేంద్రీకరణకు జై కొడతాడా? 2029 కురుక్షేత్రంలో గెలుపు గుర్రాన్ని డిసైడ్ చేయబోయే ఈ 'రాజధాని' యుద్ధంపై ఇంట్రెస్టింగ్ అనాలిసిస్..!!

- రాజకీయమా..? సిద్ధాంతమా..?
- జనంలోకి బలంగా వెళ్లడమా.. !
- అది నినాదమా.. పొలిటికల్ ఆయుధమా?

# జ(మావి)గన్ నినాదం

రాజకీయాల్లో కొన్ని నిర్ణయాలు కేవలం పాలనను మాత్రమే ప్రభావితం చేయవు. అవి తరాల చర్చకు దారితీస్తాయి. కొన్ని నినాదాలు ఎన్నికల ప్రచారానికి మాత్రమే పరిమితం కావు. అవి ఒక పార్టీ భవిష్యత్తును, ఒక నాయకుడి రాజకీయ దిశను, ఒక రాష్ట్ర రాజకీయ చర్చను పూర్తిగా మార్చేస్తాయి. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అలాంటి అంశమే రాజధాని వివాదం. పదేళ్లకు పైగా కొనసాగుతున్న ఈ చర్చకు ఇప్పుడు మరోసారి కొత్త మలుపు తిరిగింది. రాష్ట్రపతి ఆమోదంతో అమరావతి రాష్ట్ర రాజధానిగా చట్టబద్ధత పొందిన నేపథ్యంలో, మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డి "స్టాండ్ విత్ మావిగన్" అనే నినాదాన్ని తెరపైకి తీసుకురావడం రాష్ట్ర రాజకీయాలను ఒక్కసారిగా వేడెక్కించింది. అంతేకాదు ఇదే నినాదం 2029 నాటి ఎన్నికల అజెండా అంటూ ప్రకటించడం కొత్త తరం పాలిటిక్స్ లో ఆటంబాంబు పేల్చినట్టు ఒక్కసారిగా పరిస్థితులు మారిపోయాయి.

**• ముగిసిన కథకు జగన్ కొత్త మలుపు!**


అమరావతి విషయంలో జరిగిన పరిణామాలు వేగంగా సాగాయి. ముందుగా రాష్ట్ర అసెంబ్లీలో బిల్లుకు ఆమోదం లభించింది. ఆ తరువాత లోక్‌సభలో ముక్తకంఠత తో కూడిన విధంగా బిల్లు పాసయింది. అనంతరం రాజ్యసభ కూడా బిల్లుకు మద్దతు తెలిపింది. చివరకు రాష్ట్రపతి ఆమోదముద్ర పడటంతో అమరావతి రాష్ట్ర రాజధానిగా చట్టపరమైన బలం మరింత స్పష్టమైంది. దీంతో రాజధాని అంశం ముగిసిపోయిందని చాలామంది భావించారు. కానీ అదే సమయంలో జగన్ చేసిన ప్రకటన రాజకీయ చర్చను మళ్లీ ఇపుడు మొదటికి తీసుకొచ్చింది. "స్టాండ్ విత్ మావిగన్" అనే నినాదం సాధారణ రాజకీయ వ్యాఖ్య కాదు. అది 2029 ఎన్నికల దిశగా వైసీపీ తీసుకున్న కొత్త రాజకీయ వైఖరిగా విశ్లేషకులు చూస్తున్నారు. అమరావతి చర్చ ముగిసిపోయిందని భావించిన సమయంలో జగన్ మళ్లీ కొత్త ప్రత్యామ్నాయాన్ని ప్రస్తావించడం వెనుక వ్యూహం ఏమిటి? ఆయన లక్ష్యం కేవలం రాజధాని అంశాన్ని సజీవంగా ఉంచడమా? లేక ప్రాంతీయ సమతుల్య అభివృద్ధి అనే సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళ్లడమా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

**• అమరావతి వర్సెస్ మావిగన్**

తెలుగుదేశం పార్టీ మొదటి నుంచి అమరావతినే ఏకైక రాజధానిగా సమర్థిస్తోంది. రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చారని, ప్రపంచస్థాయి రాజధాని నిర్మాణమే తమ లక్ష్యమని చెబుతోంది. వైసీపీ మాత్రం అధికారంలో ఉన్నప్పుడు మూడు రాజధానుల భావనను ముందుకు తెచ్చింది. పరిపాలన వికేంద్రీకరణ అవసరమని, అభివృద్ధి ఒకే ప్రాంతానికి పరిమితం కాకూడదని వాదించింది. ఇప్పుడు "మావిగన్" నినాదంతో జగన్ అదే ఆలోచనకు కొత్త రూపం ఇస్తున్నారా? అన్న చర్చ జరుగుతోంది. అయితే రాజకీయ ప్రత్యర్థులు దీనిని పూర్తిగా వేరే కోణంలో చూస్తున్నారు. అమరావతికి చట్టబద్ధత వచ్చిన తర్వాత కూడా కొత్త నినాదాన్ని తీసుకురావడం ప్రజల్లో అయోమయం సృష్టించడమేనని విమర్శిస్తున్నారు. ఇప్పటికే ఎన్నో ఏళ్ళుగా రాజధాని అంశంపై రాష్ట్రం తీవ్ర అనిశ్చితిని ఎదుర్కొందని, పెట్టుబడులు, అభివృద్ధి, నిర్మాణాలు ఆలస్యమయ్యాయని, ఇప్పుడు మళ్లీ అదే అంశాన్ని ఎన్నికల కేంద్రంగా మార్చాలని వైసీపీ ప్రయత్నిస్తోందని ఆరోపిస్తున్నారు.

**• రాజధాని, ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం!**

మరోవైపు వైసీపీ నాయకులు మాత్రం తమ వాదనను సమర్థించుకుంటున్నారు. రాజధాని అనేది కేవలం ఒక నగరం కాదని, మొత్తం రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబం కావాలని చెబుతున్నారు. అభివృద్ధి మొత్తం ఒకే ప్రాంతంలో కేంద్రీకృతమైతే మిగతా ప్రాంతాలు వెనుకబడిపోతాయని, ఉత్తరాంధ్ర, రాయలసీమ, తీర ప్రాంతాల మధ్య సమాన అభివృద్ధి కోసం కొత్త ఆలోచన అవసరమని పేర్కొంటున్నారు. ఈ చర్చలో రైతుల అంశం మళ్లీ ముందుకొస్తోంది. అమరావతి నిర్మాణం కోసం వేలాది ఎకరాల భూములు సేకరించబడ్డాయి. అధికార పక్షం ప్రకారం అవి భూసమీకరణ విధానంలో స్వచ్ఛందంగా ఇచ్చిన భూములు. అయితే ప్రతిపక్షం తరపున కొంతమంది రైతులపై ఒత్తిడి తీసుకువచ్చారనే ఆరోపణలు గతంలో వినిపించాయి. ఈ అంశంపై రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలు ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. అయితే ఈ ఆరోపణలపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. రాజధాని నిర్మాణం అంటే కేవలం సచివాలయం, అసెంబ్లీ భవనాలు నిర్మించడం మాత్రమే కాదు. దానికి అనుబంధంగా రహదారులు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, పరిశ్రమలు, ఐటీ రంగం, ఉపాధి అవకాశాలు, పెట్టుబడులు, గృహనిర్మాణం వంటి అనేక అంశాలు ముడిపడి ఉంటాయి. అందుకే రాజధాని చర్చ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపుతుంది.



**• మావిగన్ నినాదంతో ప్రజల్లోకి జగన్!**

రాజకీయ విశ్లేషకులు చెబుతున్న మరో అంశం ఏమిటంటే... 2029 ఎన్నికల్లో రాజధాని మళ్లీ ప్రధాన అజెండాగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒకవైపు "అమరావతి పూర్తి చేయాలి" అనే నినాదంతో అధికార కూటమి ముందుకు వెళ్లే అవకాశం ఉంటే, మరోవైపు "వికేంద్రీకృత అభివృద్ధి" లేదా "మావిగన్" వంటి ప్రత్యామ్నాయ నినాదాలతో వైసీపీ ప్రజల్లోకి వెళ్లే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అయితే ఓటర్లను "అమరావతి ", "మావిగన్ అనుకూల వర్గాలుగా విభజించడం రాజకీయంగా ఎంతవరకు సరైన వ్యూహమన్న ప్రశ్న కూడా వినిపిస్తోంది. ఓటరు తన స్థానిక సమస్యలు, ఉపాధి, ధరలు, సంక్షేమం, అభివృద్ధి, పాలన వంటి అనేక అంశాలను దృష్టిలో పెట్టుకుని ఓటు వేస్తాడు. రాజధాని అంశం ముఖ్యమైనదే అయినా అది ఒక్కటే ఎన్నికల ఫలితాన్ని నిర్ణయిస్తుందా? అన్నది చూడాల్సిన అంశం. జగన్ తన రాజకీయ జీవితంలో ఎన్నో సందర్భాల్లో ఒంటరిగా నిర్ణయాలు తీసుకుని వాటిని ప్రజల్లో బలంగా సమర్థించే ప్రయత్నం చేశారు. ఇప్పుడు "మావిగన్" అంశంలో కూడా అదే ధోరణి కనిపిస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఆయన దీన్ని కేవలం ఎన్నికల నినాదంగా కాకుండా సిద్ధాంతపరమైన అంశంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని భావిస్తున్నారనే చర్చ సాగుతోంది.

**• ప్రపంచస్థాయి అమరావతి లక్ష్యం!**

ఇక అధికార పక్షం మాత్రం అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని చెబుతోంది. కేంద్ర సహకారంతో నిర్మాణాలు వేగవంతం చేస్తామని, పెట్టుబడులను ఆకర్షిస్తామని, అమరావతిని అభివృద్ధి చిహ్నంగా నిలబెడతామని పేర్కొంటోంది. రాష్ట్ర ప్రజల దృష్టిలో మాత్రం అసలు ప్రశ్న వేరే ఉంది. రాజధాని ఎక్కడ ఉండాలి అన్న దానికంటే, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు సమాన అవకాశాలు ఎలా కల్పించాలి? ఉద్యోగాలు ఎలా పెరగాలి? పరిశ్రమలు ఎలా రావాలి? యువతకు అవకాశాలు ఎలా సృష్టించాలి? అనే అంశాలపైనే ఎక్కువ ఆసక్తి కనిపిస్తోంది. అమరావతి నిర్మాణం కొనసాగినా... వికేంద్రీకరణపై చర్చ కొనసాగినా... చివరకు ప్రజలు కోరేది స్థిరత్వం, అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి. రాజకీయ పార్టీలు రాజధానిని ఎన్నికల ఆయుధంగా ఉపయోగించుకోవచ్చు. కానీ ప్రజలు మాత్రం ఫలితాలను మాత్రమే చూస్తారు. 2029 ఎన్నికల నాటికి ఈ అంశం ఏ రూపం దాలుస్తుందో ఇప్పుడే చెప్పడం కష్టం.

**• అటు అమరావతి ఇటు 'మావిగన్'**

కానీ ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. రాజధాని చర్చ ఇంకా ముగియలేదు. అమరావతి అనే భావనకు ఎదురుగా "మావిగన్" అనే కొత్త రాజకీయ నినాదాన్ని నిలబెట్టి జగన్ మరోసారి రాష్ట్ర రాజకీయాల కేంద్రబిందువుగా ఈ అంశాన్ని మార్చేశారు. అది సిద్ధాంతపరమైన పోరాటమా? రాజకీయ వ్యూహమా? అధికారంపై పంతమా? ప్రాంతీయ సమతుల్యత కోసం చేస్తున్న ప్రయత్నమా? అనే ప్రశ్నలకు సమాధానం రాబోయే రోజుల్లో ప్రజాభిప్రాయం, రాజకీయ పరిణామాలు, ఎన్నికల ఫలితాల ద్వారానే తేలనుంది. ఒక విషయం మాత్రం ఖాయం. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో "రాజధాని" అనే పదం ఇంకా ఎన్నికల నినాదంగానే ఉంది. అమరావతి అభివృద్ధి కథ కొనసాగుతూనే ఉంది. అదే సమయంలో ప్రత్యామ్నాయ ఆలోచనల చర్చ కూడా ఆగలేదు. అందుకే 2029 సమరంలో అభివృద్ధి, వికేంద్రీకరణ, ప్రాంతీయ సమానత్వం, రాజకీయ వ్యూహాలు అన్నీ కలిసిన అతిపెద్ద చర్చగా రాజధాని అంశం నిలిచే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

---

»దేశమంతటా సౌండ్ చేస్తోన్న ఆటంబాంబ్
»రామ మందిర విరాళాల చోరీ వివాదం
»లాయర్ల నిరసన.. ట్రస్టీలపై కేసులకు డిమాండ్
»అయోధ్యలో ముమ్మరమైన విచారణ ప్రక్రియ
»ప్రధాని మోదీకి కాంగ్రెస్ నేత కేసీ లేఖాస్త్రం
»బాక్సులు బద్ధలయ్యేలా పొలిటికల్ వార్!

# అయోధ్యలో పేలిన.. రాంబాంబ్





అయోధ్య రామ మందిర విరాళాల చోరీ కేసులో దర్యాప్తు వేగవంతమైంది. ప్రత్యేక దర్యాప్తు బృందం గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ఆలయ ప్రాంగణానికి చేరుకుంది. గతంలో జూన్ 15 నుండి 20 వరకు విచారణ జరిపిన అధికారులు.. ఇప్పుడు మరోసారి రంగంలోకి దిగారు. అంతకుముందు ఉదయం 11 గంటలకు అయోధ్య పోలీసులు కూడా మందిరానికి చేరుకుని రెండు గంటల పాటు తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించే గదిని నిశితంగా పరిశీలించారు. ఈ కుంభకోణంపై అయోధ్యలో తీవ్ర ప్రజా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఉదయం 11:45 గంటల సమయంలో 500 మందికి పైగా న్యాయవాదులు రోడ్లపైకి వచ్చి భారీ నిరసన చేపట్టారు. చంపత్ రాయ్, అనిల్ మిశ్రా, గోపాల్ రావులపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. అనంతరం సివిల్ లైన్స్ పోలీస్ చౌకీకి వెళ్లి సదరు ముగ్గురు ప్రముఖులతో పాటు మొత్తం నలుగురిపై రాతపూర్వక ఫిర్యాదు సమర్పించారు.

**• నిందితుల ఇళ్లపై బుల్డోజర్ యాక్షన్?**

విరాళాల దొంగతనానికి పాల్పడిన నిందితులపై కఠిన చర్యలు తీసుకునేందుకు యంత్రాంగం సిద్ధమైంది. అక్రమంగా నిర్మించిన వారి ఇళ్లపై బుల్డోజర్లు నడిపేందుకు అయోధ్య అభివృద్ధి సంస్థ ప్రణాళికలు రచిస్తోంది. నిబంధనలు ఉల్లంఘించి, అనుమతులు లేకుండా నిర్మించిన ఇళ్లను అధికారులు గుర్తించారు. అందులో భాగంగానే నిందితుడు లవకుష్ మిశ్రా భార్య సుప్రియకు నోటీసులు జారీ చేశారు. లవకుష్, అనుకల్ప్ మిశ్రాలకు చెందిన ఇళ్లను త్వరలోనే కూల్చివేసే అవకాశం ఉంది. ఈ కేసులో సరికొత్త ఆధారాలు బయటకు వస్తున్నాయి. ప్రధాన నిందితుడు అవినాష్ శుక్లా సోదరుడు అమిత్ శుక్లా చేతుల్లో భారీగా నోట్ల కట్టలు పట్టుకుని ఉన్న ఒక వీడియో సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షమైంది. ఈ వీడియో విరాళాల సొమ్ముకు సంబంధించిందేననే అనుమానంతో పోలీసులు లోతుగా దర్యాప్తు జరుపుతున్నారు. డిజిటల్ ఆధారాల ద్వారా అసలు నిజాలను వెలికితీసే ప్రయత్నం చేస్తున్నారు.

**• ప్రముఖుల విచారణ.. రాజీనామాల పర్వం**

ఈ వివాదం రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌లో తీవ్ర విభేదాలకు దారితీసింది. ట్రస్టీ మహంత్ దినేంద్ర దాస్ మహారాజ్ మొదటిసారిగా బహిరంగంగా స్పందిస్తూ.. మాజీ పదాధికారి గోపాల్ రావుపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ మొత్తం తప్పునకు గోపాల్ రావు కారణమని, ఆయన రాజకీయాలు చేస్తూ వ్యవస్థను గందరగోళంలోకి నెట్టారని విమర్శించారు. కర్ణాటకకు చెందిన గోపాల్ రావు గతంలో నిర్మాణ ఇంఛార్జిగా వ్యవహరించారు. కేసు దర్యాప్తులో భాగంగా జైల్లో ఉన్న నిందితుడు అవినాష్ శుక్లాను పోలీసులు ఇప్పటికే ప్రశ్నించారు. ట్రస్ట్ జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్‌ను గత ఆదివారం మూడు గంటల పాటు విచారించారు. ఆయన ఇచ్చిన సమాచారాన్ని సరిచూడటానికి మరో ట్రస్టీ డాక్టర్ అనిల్ మిశ్రాను నేడు ప్రశ్నించే అవకాశం ఉంది. కాగా, జూన్ 25న ఎఫ్ఐఆర్ నమోదైన వెంటనే చంపత్ రాయ్, అనిల్ మిశ్రా తమ పదవులకు రాజీనామా చేయడం గమనార్హం.

**• దేశవ్యాప్తంగా ఆందోళనకు కాంగ్రెస్ ప్రణాళికలు**

అయోధ్య రామాలయం విరాళాల సేకరణలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందనే ఆరోపణలు దేశ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఈ భారీ కుంభకోణంపై కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వంపై తన విమర్శల దాడిని మరింత ఉధృతం చేసింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఒక బహిరంగ లేఖ రాశారు. ఈ లేఖలో ఆయన అయోధ్య ఆలయ విరాళాల దొంగతనాన్ని "మహా చందా చోరీ స్కామ్" అని అభివర్ణించారు. ఈ వ్యవహారంపై తక్షణమే సుప్రీంకోర్టు పర్యవేక్షణలో నిష్పాక్షిక విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. కోట్ల రూపాయల ప్రజా ధనం దుర్వినియోగం కావడం వెనుక పెద్దల హస్తం ఉందని ఆరోపించారు.

**• హిందూ విశ్వాసాలపై జరిగిన అతిపెద్ద ద్రోహం**

రామమందిరం కోసం దేశంలోని సామాన్య ప్రజలు తమ రక్తాన్ని కూడబెట్టుకున్న సొమ్మును విరాళంగా ఇచ్చారని కేసీ వేణుగోపాల్ గుర్తుచేశారు. ప్రజలు ఎంతో పవిత్రంగా భావించే ఈ నమ్మకాన్ని కొందరు స్వార్థపరులు దారుణంగా లూటీ చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వందల కోట్ల రూపాయల మేర జరిగిన ఈ మోసం హిందూ మత విశ్వాసాలపై, సాంప్రదాయ జీవన విధానంపై జరిగిన అతిపెద్ద ద్రోహమని ఆయన లేఖలో పేర్కొన్నారు. న్యాయానికి, ధర్మానికి ప్రతీకగా నిలిచే శ్రీరాముడి ఆలయంలోనే ఇలాంటి అక్రమాలు జరగడం కోట్లాది మంది భక్తుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచిందని ఆయన స్పష్టం చేశారు. ఈ నిజాలను తొక్కిపెట్టడం దేవుడికే ద్రోహం చేయడమేనని అన్నారు.

**• యోగి సర్కార్ సిట్ విచారణ కంటితుడుపు చర్యే!**

ఈ విరాళాల దొంగతనంపై విచారణ జరిపించేందుకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం, సిట్... పనితీరును కేసీ వేణుగోపాల్ తీవ్రంగా తప్పుపట్టారు. ఈ సిట్ విచారణ అంతా ఒక కంటితుడుపు చర్యగా కనిపిస్తోందని ఆయన ఆరోపించారు. అసలైన నేరస్తులను, తెరవెనుక ఉన్న పెద్ద తలకాయలను రక్షించడానికే ఈ దర్యాప్తు ఉపయోగపడుతోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు. అధికారంలో ఉన్న పెద్దల రాజకీయ ఒత్తిళ్లకు లోబడి పనిచేసే రాష్ట్ర పోలీసుల బృందం ఈ కుంభకోణం వెనుక ఉన్న అసలు సూత్రధారులను ఎప్పటికీ పట్టుకోలేదని ఆయన విమర్శించారు. సాక్ష్యాలను రూపుమాపేందుకే సమయం తీసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

**• సీసీటీవీ ఫుటేజ్ లూటీ వెనుక వ్యవస్థాగత మద్దతు**

శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ కళ్లెదుటే ఈ భారీ దోపిడీ నెట్‌వర్క్ చాలా పకడ్బందీగా సాగిందని లేఖలో పేర్కొన్నారు. ప్రతిరోజూ ఆలయ కౌంటింగ్ సిబ్బంది నిఘా కళ్లను కప్పి నోట్ల కట్టలను, విలువైన బంగారు ఆభరణాలను దొంగిలించారని ఆరోపించారు. దీనికి తోడు దొంగతనం జరిగిన కాలానికి సంబంధించిన దాదాపు ఏడు నుండి ఎనిమిది నెలల కీలకమైన సీసీటీవీ ఫుటేజ్‌లను కావాలనే ధ్వంసం చేశారని వేణుగోపాల్ సంచలన ఆరోపణ చేశారు. ఇది కేవలం కొద్దిమంది చిన్న ఉద్యోగులు చేసిన పని కాదని, దీని వెనుక ట్రస్ట్ ఉన్నతాధికారుల, వ్యవస్థల పూర్తి మద్దతు ఉందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. గతంలో 202021 లోనే ఆలయ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ ఈ అక్రమాలను గుర్తించి హెచ్చరించారని కేసీ వేణుగోపాల్ గుర్తుచేశారు. లెక్కల్లో చూపని బంగారం, వెండి ఆభరణాలు మాయమవుతున్నాయని చెప్పినందుకు ఆ అధికారిని విచారించాల్సింది పోయి, ఉద్యోగం నుండి తొలగించారని దుయ్యబట్టారు. ప్రస్తుతం కేవలం డ్రైవర్లు, క్లర్కులు, తాత్కాలిక క్యాషియర్ల వంటి చిన్న ఉద్యోగులను మాత్రమే అరెస్ట్ చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. అసలు ఆర్డర్లు జారీ చేసిన పెద్ద నాయకులు స్వేచ్ఛగా తిరుగుతున్నారని మండిపడ్డారు.

**• ప్రధాని మోదీకి ఉన్న నైతిక బాధ్యత ఇదే**

శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌ను 2020లో భారత ప్రభుత్వమే నేరుగా ఏర్పాటు చేసిందని వేణుగోపాల్ గుర్తుచేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారమే ఈ భూమిని ట్రస్ట్‌కు అప్పగించారని చెప్పారు. కాబట్టి ఈ ఆలయ పవిత్రతను కాపాడాల్సిన పూర్తి నైతిక బాధ్యత ప్రభుత్వ దేశాధినేతగా ప్రధానమంత్రి మోదీపైనే ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ కుంభకోణంపై సుప్రీంకోర్టు ప్రత్యక్ష పర్యవేక్షణలో ఒక ఉన్నత స్థాయి స్వతంత్ర సంస్థ చేత దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. అప్పుడే దేశంలోని 140 కోట్ల మంది ప్రజలకు ప్రభుత్వ ఉద్దేశంపై నమ్మకం కలుగుతుందని ఆయన తన లేఖలో ప్రధాని మోదీని డిమాండ్ చేశారు.

**• పెద్ద తలకాయల చుట్టూ బిగుసుకోనున్న ఉచ్చు**

అయోధ్య రామాలయ విరాళాల చోరీ కేసు కేవలం చిన్న ఉద్యోగుల అరెస్టుతో ముగిసిపోయేలా కనిపించడం లేదు. నిందితుడి సోదరుడి చేతిలో ఉన్న నోట్ల కట్టల వీడియో, డిజిటల్ ఆధారాలు ఈ స్కామ్ వెనుక ఉన్న అసలు సూత్రధారులను త్వరలోనే బయటపెట్టే అవకాశం ఉంది. రాబోయే రోజుల్లో సిట్ దర్యాప్తు ట్రస్ట్ ఉన్నతాధికారులు, కీలక రాజకీయ నాయకుల చుట్టూ బిగుసుకునే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీతో పాటు దేశంలోని ప్రధాన ప్రతిపక్షాలు ఈ వ్యవహారాన్ని పార్లమెంటుతో పాటు వీధుల్లోకి తీసుకెళ్లడానికి సిద్ధమవుతున్నాయి. యోగి ప్రభుత్వ 'సిట్' దర్యాప్తుపై నమ్మకం లేదని ఇప్పటికే తేల్చి చెప్పిన నేపథ్యంలో, ఈ వివాదం త్వరలోనే సుప్రీంకోర్టు మెట్లు ఎక్కే సూచనలు కనిపిస్తున్నాయి. రాబోయే ఎన్నికల్లో ఈ చందా చోరీ వ్యవహారం విపక్షాలకు అతి పెద్ద రాజకీయ ఆయుధంగా మారబోతోంది. ఇప్పటివరకు రాముడి పేరుతో రాజకీయ లబ్ధి పొందిన అధికార పక్షానికి, ఈ విరాళాల అవినీతి ఆరోపణలు పెద్ద మచ్చగా మారే ప్రమాదం ఉంది. ఏది ఏమైనా, రాబోయే రోజుల్లో ఈ కేసు మరిన్ని సంచలన రాజీనామాలకు, దేశవ్యాప్త పొలిటికల్ హైప్‌కు దారితీయడం ఖాయంగా కనిపిస్తోంది.

# ప్రైవేట్ అంతరిక్ష సమరం

- నింగిలోకి దూసుకెళ్లనున్న విక్రమ్-1 రాకెట్
- భారత అంతరిక్ష రంగంలో సరికొత్త విప్లవం



భారతదేశపు మొట్టమొదటి ప్రైవేట్ ఆర్బిటల్ తరగతి రాకెట్ 'విక్రమ్ 1' తన మొదటి ప్రయోగ ప్రయాణానికి సర్వసిద్ధమైంది. హైదరాబాద్‌కు చెందిన ప్రైవేట్ స్పేస్ కంపెనీ 'స్కైరూట్ ఏరోస్పేస్' ఈ రాకెట్ ప్రయోగ తేదీలను అధికారికంగా ప్రకటించింది. ఈ మొదటి టెస్ట్ ఫ్లైట్‌కు 'మిషన్ ఆగమన్' అని పేరు పెట్టారు. జూలై 12 నుండి ఆగస్టు 4 మధ్య కాలంలో ఈ ప్రయోగాన్ని చేపట్టేందుకు ల్యాంచ్ విండోను ఖరారు చేశారు. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుండి వాతావరణ పరిస్థితులు, భద్రతా అనుమతుల ఆధారంగా జూలై 12న లేదా ఆ తర్వాత ఏ క్షణమైనా ఈ రాకెట్ నింగిలోకి దూసుకెళ్లనుంది.

### మిషన్ ఆగమన్ ప్రాధాన్యత

మిషన్ ఆగమన్ అంటే 'రాక' అని అర్థం. స్కైరూట్ కంపెనీ చేపడుతున్న రెండవ ప్రతిష్ఠాత్మక ప్రయోగం ఇది. గతంలో నవంబర్ 18, 2022 న ఈ సంస్థ 'విక్రమ్‌ఎస్' అనే దేశీయ తొలి ప్రైవేట్ సబ్‌ఆర్బిటల్ రాకెట్‌ను విజయవంతంగా అంతరిక్షంలోకి పంపింది. ప్రస్తుత విక్రమ్ 1 ప్రయోగం పాక్షికంగా వాణిజ్యపరమైనది. ఈ పరీక్ష విజయవంతం అయిన తర్వాత పూర్తి స్థాయి కమర్షియల్ ప్రయోగాలను ప్రారంభించనున్నారు. ఈ టెస్ట్ ఫ్లైట్‌లో స్వదేశీ, అంతర్జాతీయ కస్టమర్లకు చెందిన చిన్న ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపనున్నారు. రాకెట్ అన్ని దశల అనుసంధానం ఇప్పటికే లాంచింగ్ ప్యాడ్‌పై పూర్తయింది.

### విక్రమ్-1 రాకెట్ ప్రత్యేకతలు

విక్రమ్ 1 రాకెట్ సుమారు ఏడు అంతస్తుల ఎత్తు ఉంటుంది. ఇది పూర్తిగా కార్బన్ కాంపోజిట్ నిర్మాణంతో తయారు చేయబడిన బహుళదశల ఆర్బిటల్ లాంచ్ వెహికల్. దీనిని నడపడానికి కంపెనీ స్వంతంగా అభివృద్ధి చేసిన ప్రొపల్షన్ సిస్టమ్స్ ఉపయోగించారు. ఇందులో త్రీడీ ప్రింటెడ్ ఇంజన్లు, అత్యంత శక్తివంతమైన ఘన ఇంధన రాకెట్ బూస్టర్లు ఉన్నాయి. భూమికి దగ్గరగా ఉండే తక్కువ ఎత్తు కక్ష్యలోకి 350 కిలోల బరువు గల చిన్న ఉపగ్రహాలను మోసుకెళ్లేలా దీనిని రూపొందించారు. ఈ తొలి మిషన్‌లో 450 కిలోమీటర్ల ఎత్తులోని కక్ష్యను చేరుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.

### నిజ సమయ సమాచార సేకరణ

ఈ ప్రయోగం ద్వారా రాకెట్ ప్రొపల్షన్, విడిభాగాల వేరుపడటం, గమనాన్ని నియంత్రించే నావిగేషన్ వ్యవస్థల పనితీరుకు సంబంధించిన అత్యంత కీలకమైన సమాచారాన్ని సేకరించనున్నారు. రాకెట్ నింగికి ఎగిరిన క్షణం నుండి అంతరిక్షంలోకి వెళ్లే ప్రతి దశను నిశితంగా పరిశీలిస్తారు. భూమిపై చేసే పరీక్షల ద్వారా లభించని నిజమైన ఇన్‌ఫ్లైట్ డేటాను ఈ ప్రయోగం అందిస్తుందని స్కైరూట్ సీఈఓ పవన్ కుమార్ చందన తెలిపారు. ఈ ప్రయోగం విజయవంతమైతే భారత ప్రైవేట్ అంతరిక్ష రంగం సరికొత్త చరిత్రను సృష్టిస్తుంది.

# మంత్రి ఆనంకు యువకుడి ఘన స్వాగతం




**ప్రొద్దుటూరు, జూలై 2**: రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి గురువారం ప్రొద్దుటూరు పర్యటనలో భాగంగా యువ నాయకుడు భూమిరెడ్డి సూర్య ప్రతాప్ రెడ్డి ఆహ్వానం మేరకు భగత్‌సింగ్ కాలనీలోని ఆయన నివాసానికి విచ్చేశారు. మంత్రి రాక సందర్భంగా సూర్య ప్రతాప్ రెడ్డి, కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ పెద్ద భూమిరెడ్డి శ్రీనివాసులరెడ్డితో ప్రత్యేకంగా సమావేశమై స్థానిక పరిస్థితులు, అభివృద్ధి అంశాలు, సామాజిక విషయాలపై చర్చించారు.యువ నాయకుడు భూమిరెడ్డి సూర్య ప్రతాప్ రెడ్డి ప్రజలతో నిరంతరం మమేకమై సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న తీరును పలువురు అభినందించారు. మంత్రి తన నివాసానికి విచ్చేయడం తమ కుటుంబానికి సంతోషకరమైన విషయమని సూర్య ప్రతాప్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఆనంకు శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

# మాట నిలబెట్టుకున్న సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణలోని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాల చెల్లింపు విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన మాట నిలబెట్టుకున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లు, సొసైటీలు, విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న సిబ్బందికి ఈ నెల మొదటి తేదీనే వేతనాలు విడుదలయ్యాయి. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ బుధవారం ఈ నిధులను నేరుగా ఉద్యోగుల ఖాతాల్లో జమ చేసింది. గతంలో జీతాలు ఆలస్యంగా రావడం వల్ల సిబ్బంది ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించిన సీఎం.. రెగ్యులర్ ఉద్యోగులతో పాటే వీరికి కూడా ఒకటో తారీఖున చెల్లింపులు జరపాలని కఠిన ఆదేశాలు ఇచ్చారు. సీఎం ఆదేశాల అమలు కోసం ఆర్థిక శాఖ అన్ని విభాగాలకు స్పష్టమైన మార్గదర్శకాలతో సర్క్యులర్ జారీ చేసింది. ప్రతి నెల 25వ తేదీలోగా జీతాల బిల్లులను ట్రెజరీ, పే అండ్ అకౌంట్స్ కార్యాలయాలకు సమర్పించాలని సూచించింది. నెల చివరి పని దినానికల్లా ఆడిట్, పరిశీలన ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టం చేసింది. బుధవారం ఈ చెల్లింపుల ప్రక్రియను ముఖ్యమంత్రి స్వయంగా ఆర్థిక శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

# స్టీల్ ప్లాంట్ ఏర్పాట్లపై మంత్రి సవిత సమీక్ష



కడప జిల్లా జమ్మలమడుగులో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో, సభా ప్రాంగణాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. మంత్రి సవిత అధికారులతో మాట్లాడి ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆమె, గత ప్రభుత్వం కడప జిల్లాకు చెప్పుకోదగ్గ అభివృద్ధి చేయలేదని విమర్శించారు. స్టీల్ ప్లాంట్ విషయంలో క్రెడిట్ చోరీ జరుగుతోందంటూ వైసీపీ చేస్తున్న ఆరోపణలను ఖండించారు.

# రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు దొంగతనం

**చీరాల, జూలై 2(నాదేశం):** చీరాల మండల పరిధిలో దొంగలు రెచ్చిపోయారు. పిట్టువారి పాలెం - గవినివారి పాలెం గ్రామాల మధ్య ఉన్న పంట పొలాలకు విద్యుత్ సరఫరా చేసే రెండు ట్రాన్స్‌ఫార్మర్లను అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు దొంగిలించిన ఘటన స్థానిక రైతాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేసింది.ఈ దొంగతనం కారణంగా గురువారం ఉదయం నుంచి వ్యవసాయ పొలాలకు విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో మోటార్లు నడవక, ప్రస్తుతం సాగులో ఉన్న వేరుశనగ పంటలకు నీరందించలేక పోతున్నామని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# తమిళనాడులో ఘోరం

తమిళనాడులోని తంజావూరు జిల్లా పుళుదికుడికి చెందిన రవిచంద్రన్(54), ఉమారాణి(48) దంపతులకు 27 ఏళ్ల క్రితం పెళ్లయింది. కొత్త ఇంటి నిర్మాణం కోసం రవిచంద్రన్ పది లక్షల రూపాయల అప్పు చేశాడు. ఆ అప్పు తీరక, రుణదాతల ఒత్తిడి ఎక్కువవడంతో దంపతుల మధ్య రోజూ గొడవలు జరిగేవి. భర్త చనిపోతే అప్పుల బాధ తప్పుతుందని ఉమారాణి క్రూరంగా ఆలోచించింది. తన తమ్ముడు జ్ఞానశేఖరన్‌తో కలిసి భర్తను చంపడానికి స్కెచ్ వేసింది. మంగళవారం రాత్రి రవిచంద్రన్ నిద్రిస్తుండగా ఇద్దరూ కలిసి అతని చెవిలో విషం పోశారు. వెంటనే మేల్కొన్న రవిచంద్రన్, వారి నుండి తప్పించుకుని కుంభకోణం ఆస్పత్రిలో చేరాడు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు. గతంలోనూ వీరు టీలో విషం కలిపి చంపాలని చూశారని విచారణలో తేలింది. కోర్టు నిందితులకు రిమాండ్ విధించి జైలుకు పంపింది.

# విద్యుత్ ఉద్యోగుల సమర శంఖం!

తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని 'తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ' డిమాండ్ చేసింది. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ విట్టల్ వెంటనే జోక్యం చేసుకోవాలని కోరింది. జేఏసీ చైర్మన్ సాయిబాబా, కన్వీనర్ రత్నాకర్ రావు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో భారీ సమావేశం జరిగింది. యాజమాన్యానికి నోటీసు ఇచ్చినా స్పందన లేకపోవడంతో తదుపరి కార్యాచరణ ప్రకటించారు. పీఆర్‌సీ 2026 కమిటీ ఏర్పాటు, ఆర్టిజన్ల సమస్యలు, 5000 ఖాళీల భర్తీ, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని జేఏసీ డిమాండ్ చేసింది. వైటిపిఎస్ ప్లాంట్ ప్రైవేటీకరణ టెండర్లను రద్దు చేయాలని హెచ్చరించింది. ఈ నిరసనలో భాగంగా జులై 3 నుండి 7 వరకు నల్ల బ్యాడ్జీల ధారణ, గేట్ మీటింగ్స్ నిర్వహించనున్నారు. జులై 7న 'చలో వైటిపిఎస్' చేపట్టి తదుపరి ఉమ్మడి కార్యాచరణ ప్రకటిస్తామని జేఏసీ స్పష్టం చేసింది.

# భారత్ జపాన్ కొత్త కూటమి

- అంతర్జాతీయ రాజకీయాల్లో సంచలనం
- రక్షణ ఆర్థిక రంగాల్లో వ్యూహాత్మక అడుగులు



భారతదేశం జపాన్ దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు సరికొత్త ఒప్పందాలు కుదిరాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జపాన్ ప్రధానమంత్రి సనాయ్ తకైచితో గురువారం న్యూఢిల్లీలో విస్తృతస్థాయి చర్చలు జరిపారు. ఈ సమావేశంలో సైనిక హార్డ్‌వేర్ ఉమ్మడి అభివృద్ధి కోసం ఒక రక్షణ ఒప్పందంతో పాటు ఆర్థిక భాగస్వామ్య ఫ్రేమ్‌వర్క్‌ను ఇరు దేశాలు ఆవిష్కరించాయి. ఏఐ రంగంలో సహకారం ఎనర్జీ సప్లై చైన్ బలోపేతం చేయడంపై ఉమ్మడి ప్రకటనలు విడుదలయ్యాయి.

### పరస్పర నమ్మకమే అతిపెద్ద ఆస్తి

భారత్ జపాన్ ఆర్థిక వ్యవస్థలు ఒకదానికొకటి పూరకాలుగా పనిచేస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. సాంస్కృతిక విలువల నుండి ఆధునిక సాంకేతికత వరకు రెండు దేశాల ఆలోచనా విధానంలో ఎంతో సారూప్యత ఉందని చెప్పారు. ఇరు దేశాల సంబంధాలు బలమైన పరస్పర నమ్మకంపై ఆధారపడి ఉన్నాయని స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన జీ7 సదస్సులో తాను చెప్పినట్లుగానే ప్రస్తుత ప్రపంచ అస్థిరతల మధ్య పరస్పర విశ్వాసమే అతిపెద్ద వ్యూహాత్మక ఆస్తి అని మోదీ కొనియాడారు.

### గ్రామీణ ఉపాధికి ఊతమిచ్చే గ్యాస్ ప్లాంట్లు

ఆర్థిక ఇంధన భద్రత రంగాలలో ఇరు దేశాలు ఒక ఉమ్మడి రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసుకున్నాయి. దీని ద్వారా సెమీకండక్టర్లు, క్వాంటం వంటి వ్యూహాత్మక రంగాలలో సప్లై చైన్‌ను బలోపేతం చేయనున్నారు. ఇంధన భద్రత రంగంలో తీసుకున్న నిర్ణయాల ప్రకారం భారత్‌జపాన్ బయోగ్యాస్ చొరవ కింద భారతదేశంలోని గ్రామాల్లో 1000 బయోగ్యాస్, సేంద్రీయ ఎరువుల ప్లాంట్లను స్థాపించనున్నారు. ఇది భారతీయ గ్రామాలలో సుస్థిరతకు, గ్రామీణ జీవనోపాధికి సరికొత్త బలాన్ని ఇస్తుందని ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు.

### సాంకేతిక పరిజ్ఞానంతో సరికొత్త వృద్ధి

జపాన్ దేశానికి ఉన్న ఖచ్చితమైన సాంకేతిక పరిజ్ఞానం, భారతదేశానికి ఉన్న సాఫ్ట్‌వేర్ సామర్థ్యాల కలయిక కృత్రిమ మేధస్సు (AI) రంగానికి సరికొత్త వేగాన్ని ఇస్తుందని నేతలు అభిప్రాయపడ్డారు. రక్షణ రంగంలో మొదటి ఉమ్మడి అభివృద్ధి ప్రాజెక్టుపై ఇరు దేశాలు సంతకాలు చేశాయి. మూడు రోజుల పర్యటన నిమిత్తం భారత్ వచ్చిన జపాన్ ప్రధాని సనాయ్ తకైచి మాట్లాడుతూ.. పెట్టుబడులు, ఆవిష్కరణల ద్వారా ఆర్థిక వృద్ధిని సాధించడంపైనే తాము దృష్టి కేంద్రీకరించినట్లు తెలిపారు.

# తిరుచ్చి బరిలో త్రిష?

- పొలిటికల్ స్క్రీన్‌పైకి నటి
- రంగం సిద్ధం చేస్తున్న విజయ్
- పాలనలో సహాయం కోసమేనా?
- తమిళనాడులో ఆసక్తికర చర్చ



తమిళనాడు రాజకీయాల్లో ప్రస్తుతం ఒక ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. కోలీవుడ్ స్టార్ హీరోయిన్ త్రిష త్వరలోనే ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగు పెట్టబోతున్నారనే వార్తలు బలంగా వినిపిస్తున్నాయి. తిరుచ్చి నియోజకవర్గానికి జరగబోయే ఉపఎన్నికలో ఆమె అధికార పార్టీ తరపున పోటీ చేసే అవకాశం ఉందనే ప్రచారం జోరందుకుంది. ఈ వార్త ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద సంచలనంగా మారింది.

### విజయ్ రాజీనామాతో ఉపఎన్నిక

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రస్తుత ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేసి ఘన విజయం సాధించారు. ఆ తర్వాత ఆయన తిరుచ్చి స్థానానికి రాజీనామా చేయడంతో అక్కడ ఉపఎన్నిక అనివార్యమైంది. ఈ ఖాళీ స్థానాన్ని భర్తీ చేయడానికి అధికార పార్టీ బలమైన అభ్యర్థి కోసం అన్వేషణ మొదలుపెట్టింది.

### లారెన్స్ వెనకడుగు, బరిలో త్రిష


మొదట తిరుచ్చి స్థానం నుంచి ప్రముఖ హీరో, కొరియోగ్రాఫర్ రాఘవ లారెన్స్ పోటీ చేస్తారని అందరూ భావించారు. ఆయన కూడా రాజకీయాల్లోకి రావడానికి ఆసక్తి చూపినట్లు సమాచారం వచ్చింది. చివరి నిమిషంలో లారెన్స్ ఈ పోటీ నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నారు. ఆయన తీసుకున్న ఈ నిర్ణయం తిరుచ్చి రాజకీయాలను ఒక్కసారిగా మార్చేసింది. లారెన్స్ తప్పుకోవడంతో తిరుచ్చి అభ్యర్థి ఎవరనే ఉత్కంఠ పెరిగింది. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి విజయ్‌కు అత్యంత సన్నిహితురాలైన త్రిష పేరు తెరపైకి వచ్చింది. ఆమెను రాజకీయాల్లోకి తీసుకువచ్చి ఉపఎన్నిక బరిలో నిలిపితే బాగుంటుందని పార్టీ వర్గాలు భావిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. తమిళ రాజకీయ వర్గాల్లో ఈ అంశంపై పెద్ద ఎత్తున ఊహాగానాలు నడుస్తున్నాయి.

### అధికారిక ప్రకటన కోసం నిరీక్షణ

ఈ ప్రచారంపై ఇటు నటి త్రిష గానీ, అటు ముఖ్యమంత్రి విజయ్ గానీ ఇప్పటివరకు ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. ప్రస్తుతానికి ఇవన్నీ కేవలం ఊహాగానాలే అయినప్పటికీ, అభిమానుల్లో మాత్రం తీవ్ర ఆసక్తి నెలకొంది. దీనిపై అధికారిక ప్రకటన వస్తేనే పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# పూణె హత్య కేసులో కొత్త ట్విస్ట్

- టెక్నాలజీ ఆధారంగా విచారణ
- గేట్ అనాలిసిస్ శాస్త్ర వినియోగం
- కేతన్ హత్య కేసు మిస్టరీపై సస్పెన్స్
- నేరస్థులను పట్టించే నడక రహస్యం



పూణె కోర్టు కేతన్ అగర్వాల్ హత్య కేసులో నిందితులైన సియా గోయల్, చేతన్ చౌదరిల పోలీసు కస్టడీని జూలై 3, 2026 వరకు పొడిగించింది. ఈ కేసులో అనేక కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని దర్యాప్తు అధికారులు న్యాయస్థానానికి తెలిపారు. నిందితుడు చేతన్ చౌదరి నడక తీరుపై ఫోరెన్సిక్ అధ్యయనం నిర్వహించాల్సిన అవసరం ఉందని పోలీసులు పేర్కొన్నారు. లోహగఢ్ కోట సమీపంలో నేరం జరిగిన ప్రదేశంలో తలపై హుడీ ధరించిన ఒక వ్యక్తి తిరుగుతున్నట్లు సీసీటీవీ దృశ్యాలు లభించాయి. ఆ దృశ్యాల్లో ఉన్న వ్యక్తి చేతన్ చౌదరి అవునో కాదో నిర్ధారించడానికి అతని నడక తీరును విశ్లేషించాలని పోలీసులు నిర్ణయించారు.

### ఏమిటీ గేట్ అనాలిసిస్ శాస్త్రం?

మనుషులు నడిచే లేదా పరుగెత్తే విధానాన్ని శాస్త్రీయంగా అధ్యయనం చేయడాన్ని గేట్ అనాలిసిస్, నడక విశ్లేషణ అంటారు. నడక అనేది ఒక సంక్లిష్టమైన ప్రక్రియ. దీని కోసం శరీరం కండరాలు, ఎముకలు, నరాల వ్యవస్థ మధ్య నిరంతరం సమన్వయం చేసుకోవాల్సి ఉంటుంది. ఈ విశ్లేషణ ద్వారా ఒక నిర్దిష్ట వ్యక్తి ఏ విధంగా అడుగులు వేస్తాడనే పూర్తి వివరాలను శాస్త్రవేత్తలు గుర్తిస్తారు. వైద్య రంగంలో ఒక వ్యక్తికి ఎందుకు నొప్పులు వస్తున్నాయి లేదా ఒక వ్యాధి ఎలా పెరుగుతుందో అర్థం చేసుకోవడానికి దీనిని ఉపయోగిస్తారు. క్రీడాకారులు వేగంగా పరుగెత్తడానికి దీనిని వాడుకుంటారు. ఫోరెన్సిక్ రంగంలో సీసీటీవీల్లో నమోదైన నడక తీరును అనుమానితుల నడకతో పోల్చడానికి దీనిని ఒక కీలక ఆధారంగా చూస్తారు.

### నడక చక్రం ప్రాధాన్యత

ఒక వ్యక్తి కదలికలను అర్థం చేసుకోవడానికి నిపుణులు ముందుగా 'గేట్ సైకిల్' నడక చక్రం పరిశీలిస్తారు. ఒక అడుగు నేలను తాకినప్పటి నుండి మళ్లీ అదే అడుగు నేలను తాకే వరకు జరిగే వరుస కదలికలను నడక చక్రం అంటారు. ఇందులో రెండు ప్రధాన దశలు ఉంటాయి. మొదటిది స్టాన్స్ ఫేస్... అంటే అడుగు నేలపై ఉన్నప్పుడు శరీరం బరువును మోసే సమయం. రెండవది స్వింగ్ ఫేస్... అంటే అడుగు గాల్లో ఉండి తదుపరి అడుగు ముందుకు పడే సమయం. ఈ విశ్లేషణ సమయంలో నిపుణులు ప్రత్యేక పరికరాలను ఉపయోగించి నిమిషానికి ఎన్ని అడుగులు పడుతున్నాయి, అడుగు పొడవు ఎంత, కాళ్ల కీళ్ల కోణాలు ఎలా మారుతున్నాయి వంటి వివరాలను నమోదు చేస్తారు.

### ఫోరెన్సిక్ గేట్ అనాలిసిస్ ప్రత్యేకత

ఫోరెన్సిక్ రంగంలో వేలిముద్రల తరహాలోనే ఒక వ్యక్తి నడక తీరును కూడా ప్రత్యేక గుర్తింపుగా వాడుకోవచ్చు. కేతన్ అగర్వాల్ కేసులో లభించిన వీడియోలో ఉన్న వ్యక్తి తలపై హుడీ ధరించడం వల్ల ముఖం స్పష్టంగా కనిపించడం లేదు. అందువల్ల పోలీసులు గేట్ అనాలిసిస్ పద్ధతిని ఎంచుకున్నారు. ఇందులో భాగంగా మానవ కదలికల నిపుణులు నేరానికి సంబంధించిన వీడియోను, నిందితుడు సాధారణంగా నడిచే వేరే వీడియోతో పోల్చి చూస్తారు. అడుగుల లయ, చేతులు ఊపే విధానం, తల వాల్చే తీరు లేదా స్వల్పంగా కుంటుతూ నడవడం వంటి ప్రత్యేక లక్షణాలను నిశితంగా గమనిస్తారు. రెండు వీడియోలలో ఒకే రకమైన ప్రత్యేక కదలికలు ఉంటే ఆ వ్యక్తి ఒక్కరేనని నిర్ధారిస్తారు.

# ఈ చరిత్ర ఇంకెన్నాళ్లు?

- ఏ సిరాతో రాయాలి... నీ నిర్లక్ష్యపు హిస్టరీ ?
- శభాష్... వార్డెన్ హేమా..!

రాళ్లబాటలో నడకతోనా... రగులుతున్న హృదయ ఘోషతోనా... దేశమా... రాష్ట్రమా... రాజకీయమా... మౌనం వీడవా...? కొన్ని వార్తలు వార్తలుగా ముగిసిపోవు. అవి మనసును వెంటాడే ప్రశ్నలుగా మిగిలిపోతాయి. మరికొన్ని సంఘటనలు కేవలం ఒక వ్యక్తి చేసిన గొప్ప పనిని మాత్రమే చెప్పవు... ఒక వ్యవస్థ ఎక్కడ విఫలమైందో అద్దంలా చూపిస్తాయి. మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం గిరిజన ప్రాంతంలో జరిగిన ఈ ఘటన కూడా అలాంటిదే. తీవ్ర జ్వరంతో బాధపడుతున్న ఒక గిరిజన విద్యార్థిని ని ఆసుపత్రికి చేర్చేందుకు, రోడ్డు లేక ఆరు కిలోమీటర్ల రాళ్ల దారిలో భుజాలపై మోసుకెళ్లిన వార్డెన్ హేమ కథ, మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం. అదే సమయంలో అభివృద్ధి గురించి మనం చెప్పుకునే గొప్ప కథనాలకు ఎదురుగా నిలిచే చేదు వాస్తవం.

### బాలికను భుజాలపై మోసిన ఆశ్రమ వార్డెన్

గుమ్మలక్ష్మీపురం గిరిజన బాలికల సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న వాటాక భువనేశ్వరి తీవ్ర జ్వరంతో పాఠశాలకు రాకపోవడంతో వార్డెన్ హేమ ఆమె గ్రామానికి వెళ్లారు. విద్యార్థిని పరిస్థితి విషమంగా ఉండటంతో వెంటనే ఆసుపత్రికి తరలించాలని నిర్ణయించారు. అయితే గ్రామానికి రహదారి లేకపోవడం, వాహనాలు చేరుకోలేని పరిస్థితి ఆమె ముందున్న పెద్ద అడ్డంకిగా మారింది. అయినా వెనుకడుగు వేయకుండా, ఆ చిన్నారిని తన భుజాలపై మోసుకుంటూ సుమారు ఆరు కిలోమీటర్ల దూరం రాళ్లు, గుట్టలు, ఎత్తుపల్లాలతో కూడిన దారిలో నడిచి ఆసుపత్రికి చేర్చారు. ఈ దృశ్యం చూసిన ప్రతి ఒక్కరూ వార్డెన్ హేమను అభినందిస్తున్నారు. ఆమె చేసిన పని ఉద్యోగ బాధ్యతకు మించినది. అది మానవత్వానికి ప్రతీక. ఒక తల్లి తన బిడ్డను కాపాడినట్లు, ఒక గురువు తన విద్యార్థిని కోసం ప్రాణం పెట్టినట్లు ఆమె వ్యవహరించారు. ఇలాంటి వ్యక్తుల వల్లే ప్రభుత్వ వ్యవస్థపై ప్రజల్లో కొంత నమ్మకం నిలిచి ఉందనిపిస్తుంది.

### గిరిజన గ్రామాల రహదారుల లేమిపై ప్రశ్నలు

ఈ సంఘటనను కేవలం హేమ గొప్పతనంగా మాత్రమే చూడటం సరిపోదు. అసలు ప్రశ్న ఏమిటంటే, ఒక అనారోగ్యంతో ఉన్న బాలికను ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు ఇప్పటికీ ఒక మనిషి భుజాలే ఆధారం కావాల్సి రావడం ఎందుకు? స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా, అభివృద్ధి, డిజిటల్ ఇండియా, మౌలిక సదుపాయాల విస్తరణ అంటూ ఎన్నో ప్రకటనలు వినిపిస్తున్నా, గిరిజన ప్రాంతాల్లో కనీస రహదారి కూడా లేకపోవడం ఎవరి వైఫల్యం? ప్రతి ఎన్నికల సమయంలో అభివృద్ధి హామీలు వినిపిస్తాయి. గిరిజన ప్రాంతాలకు ప్రత్యేక నిధులు, ప్రత్యేక పథకాలు, ప్రత్యేక శ్రద్ధ అంటూ ప్రకటనలు వస్తుంటాయి. కానీ వాస్తవంలో జ్వరం వచ్చిన ఒక విద్యార్థిని ఆసుపత్రికి చేర్చేందుకు రోడ్డు లేకపోవడం ఆ హామీలన్నింటినీ ప్రశ్నిస్తుంది. కోట్ల రూపాయల ప్రాజెక్టులు ప్రారంభించడం కంటే, ఒక గ్రామానికి అంబులెన్స్ చేరే రహదారి వేయడం గొప్ప అభివృద్ధి కాదా అనే ప్రశ్న ప్రతి పౌరుడి మనసులో మెదులుతుంది.

### వ్యవస్థ నిర్లక్ష్యాన్ని ప్రశ్నించిన వార్డెన్ అడుగులు

హేమ భుజాలపై మోసింది కేవలం ఒక విద్యార్థినిని కాదు... మన వ్యవస్థ నిర్లక్ష్యాన్ని కూడా మోసింది. ఆమె అడుగులు ఆరు కిలోమీటర్లు మాత్రమే నడవలేదు... పాలకుల బాధ్యతను, సమాజం మౌనాన్ని, అభివృద్ధి అసమానతలను ప్రశ్నిస్తూ సాగాయి. ఈ సంఘటనను వైరల్ దృశ్యాలుగానో.. కన్నీటి చిత్రాలుగానో.. చూసి మరచిపోతే, ఇలాంటి కథలు మళ్లీ మళ్లీ పునరావృతమవుతూనే ఉంటాయి. నిజంగా ఇక్కడ అభివాదాలు అభినందనలు.. వార్డెన్ హేమకు పూలమాలలు వేయడం కాదు. ఆమె మోసిన దారిలో రహదారి వేయడం. ఆ గ్రామానికి అంబులెన్స్ చేరేలా చేయడం. ఇకపై ఏ చిన్నారి కూడా వైద్యం కోసం ఒక మనిషి భుజాలపై ప్రయాణించాల్సిన పరిస్థితి రాకుండా చూడడం. అదే ప్రభుత్వ బాధ్యత, అదే సమాజ ధర్మం. లేకపోతే ప్రతి తరమూ ఇదే ప్రశ్నను మళ్లీ అడుగుతూనే ఉంటుంది... ఈ చరిత్ర ఇంకెన్నాళ్లు..? ఏ సిరాతో రాయాలి... నీ జబ్బుల చరిత్ర? రాళ్లబాటలో నడకతోనా... రగులుతున్న హృదయ ఘోషతోనా?



# వందకు చేరువవుతుందా?

- డాలర్ ధాటికి రూపాయి పతనం
- రోజు రోజుకు తగ్గుతున్న స్వదేశీ కరెన్సీ

రూపాయి ప్రారంభ లాభాలను కోల్పోయి గురువారం అమెరికా డాలర్‌తో పోలిస్తే 18 పైసలు క్షీణించి 95.34 వద్ద ముగిసింది. ముడిచమురు ధరలు తగ్గినప్పటికీ.. దిగుమతిదారులు, కార్పొరేట్ సంస్థల నుండి డాలర్లకు విపరీతంగా డిమాండ్ పెరగడం రూపాయి విలువను దెబ్బతీసింది. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్లో రూపాయి 94.95 వద్ద బలంగానే ప్రారంభమైంది. ట్రేడింగ్ సమయంలో 94.90 నుండి 95.40 మధ్య ఊగిసలాడిన కరెన్సీ.. చివరకు మునుపటి ముగింపుతో పోలిస్తే నష్టాల్లో ముగిసింది. బుధవారం కూడా రూపాయి ఏకంగా 60 పైసలు క్షీణించిన సంగతి తెలిసిందే.

### అంతర్జాతీయ అనిశ్చితి భయాలు

అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ ముడిచమురు ధర 1.43 శాతం తగ్గి బ్యారెల్‌కు 70.55 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. చమురు ధరల తగ్గుదల, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోక్యం రూపాయికి కొంత మద్దతుగా నిలిచాయి. అయినప్పటికీ అమెరికా, ఇరాన్ దేశాల మధ్య ఉన్న రాజకీయ అనిశ్చితి కారణంగా రూపాయిపై ఒత్తిడి కొనసాగుతుందని ఆర్థిక విశ్లేషకులు భావిస్తున్నారు. రాబోయే రోజుల్లో రూపాయి మార్పిడి విలువ 95.00 నుండి 95.60 పరిధిలో ట్రేడ్ అయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

### స్టాక్ మార్కెట్లలో లాభాల పంట

రూపాయి నష్టపోయినప్పటికీ దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం లాభాల బాట పట్టాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ 579.48 పాయింట్లు పెరిగి 77,502.12 వద్ద స్థిరపడింది. అటు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ కూడా 169.85 పాయింట్లు పుంజుకుని 24,175.70 వద్ద ముగిసింది. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు బుధవారం ఒక్కరోజే రూ.1,140.50 కోట్ల విలువైన షేర్లను విక్రయించినట్లు ఎక్స్ఛేంజ్ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. భౌగోళిక రాజకీయ పరిస్థితులు మారితేనే రూపాయి మళ్లీ కోలుకునే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

# సంగీత సమరం

- ఇళయరాజాకు ఢిల్లీ హైకోర్టులో షాక్
- మ్యూజిక్ సంస్థతో కాపీరైట్ ఇష్యూ

ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా, ప్రముఖ మ్యూజిక్ లేబుల్ సరిగమ ఇండియా లిమిటెడ్ మధ్య సాగుతున్న కాపీరైట్ వివాదంలో ఢిల్లీ హైకోర్టు బుధవారం కీలక తీర్పు ఇచ్చింది. 1976 నుండి వచ్చిన 134 సినిమాలకు సంబంధించిన పాటలను ప్రసారం చేయకుండా, ఇతరులకు చేరవేయకుండా ఇళయరాజాపై కోర్టు తాత్కాలిక నిషేధం విధించింది. జస్టిస్ తుషార్ రావు గెడెలా ఈ కేసును విచారించారు. ఇళయరాజా తాను సృష్టించిన సంగీత స్వరకల్పనలపై మాత్రమే కాపీరైట్ హక్కులను కలిగి ఉంటారని న్యాయస్థానం స్పష్టం చేసింది.

### ధ్వని ముద్రణ హక్కులు నిర్మాత సొంతం

సినిమాల్లో చేర్చిన సౌండ్ రికార్డింగ్‌లపై, హక్కులు నిర్మాతలకు లేదా వాటిని కొనుగోలు చేసిన సరిగమ సంస్థకు మాత్రమే చెందుతాయని కోర్టు తేల్చింది. కాపీరైట్ చట్టం ప్రకారం ఇళయరాజా హక్కులు కేవలం స్వరకల్పనకు మాత్రమే పరిమితం అవుతాయని పేర్కొంది. 1976 నుండి 2001 మధ్య కాలంలో తాము అనేక మంది సినిమా నిర్మాతలతో ఒప్పందాలు చేసుకున్నామని సరిగమ సంస్థ కోర్టుకు తెలిపింది. ఆ ఒప్పందాల ప్రకారం ఆయా సినిమాల్లోని పాటల సౌండ్ రికార్డింగ్‌లపై పూర్తి యాజమాన్య హక్కులు తమకే ఉన్నాయని స్పష్టం చేసింది.

### డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లపై పాటల వివాదం

సరిగమ సంస్థకు హక్కులున్న పాటలను ఇళయరాజా ఇటీవల అమెజాన్ మ్యూజిక్, ఐట్యూన్స్, జియో సావన్ వంటి వివిధ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో అప్‌లోడ్ చేశారని సరిగమ సంస్థ ఆరోపించింది. ఆ పాటలపై ఇళయరాజా యాజమాన్య హక్కులను క్లెయిమ్ చేయడం చట్టవిరుద్ధమని పేర్కొంది. ఈ వాదనలతో ఏకీభవించిన కోర్టు, వివాదంలో ఉన్న సౌండ్ రికార్డింగ్‌లను ఉపయోగించడం కాపీరైట్ ఉల్లంఘన కిందకే వస్తుందని ప్రాథమికంగా నిర్ధారించింది.

# మెస్సీ జెర్సీతో యశస్వి సందడి!

- ఎంజాయ్ చేసిన టీమిండియా స్టార్

భారత క్రికెట్ జట్టు యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ క్రికెట్ మ్యాచ్‌ల నుండి దొరికిన విరామ సమయాన్ని ఫుట్‌బాల్ ఆటను ఆస్వాదిస్తూ గడుపుతున్నారు. అమెరికాలోని న్యూయార్క్ న్యూజెర్సీ వేదికగా జరుగుతున్న ఫిఫా ప్రపంచకప్ 2026 రౌండ్ ఆఫ్ 32 మ్యాచ్‌ను ప్రత్యక్షంగా చూసేందుకు ఆయన స్టేడియానికి వెళ్లారు. అక్కడ ఫ్రాన్స్, స్వీడన్ దేశాల మధ్య జరిగిన ఉత్కంఠభరిత పోరును జైస్వాల్ పూర్తిగా ఆస్వాదించారు. ఈ మ్యాచ్‌లో ఫ్రాన్స్ జట్టు 30 తేడాతో స్వీడన్‌పై ఘన విజయం సాధించి తదుపరి రౌండ్‌కు దూసుకెళ్లింది. స్టేడియంలో మ్యాచ్ జరుగుతున్న సమయంలో జైస్వాల్ అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ జెర్సీని ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ పర్యటనకు సంబంధించిన ఒక చిన్న వీడియో క్లిప్‌ను ఆయన తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకుంటూ.. తన కోరికల జాబితా నెరవేరిందని రాసుకొచ్చారు.






# శ్రీలంకతో టెస్ట్ క్రికెట్ సమరం

**ఆగస్టు 15 నుండి సిరీస్ ఆరంభం** ▪ **షెడ్యూల్ ప్రకటించిన బీసీసీఐ**

శ్రీలంకలో పర్యటించనున్న భారత క్రికెట్ జట్టు రెండు టెస్టుల సిరీస్‌లో తలపడనుంది. ఈ మేరకు బీసీసీఐ గురువారం అధికారిక షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఆగస్టు 15 నుండి 27 వరకు ఈ సిరీస్ జరగనుంది. తొలి టెస్టు మ్యాచ్ ఆగస్టు 15న గాలే ఇంటర్నేషనల్ స్టేడియంలో, రెండో టెస్టు ఆగస్టు 23న కొలంబోలోని సింహలీస్ స్పోర్ట్స్ క్లబ్ మైదానంలో జరగనున్నాయి. భారత కాలమానం ప్రకారం ఈ రెండు మ్యాచ్‌లు ఉదయం 10:00 గంటలకు ప్రారంభం కానున్నాయి. ఈ సిరీస్ ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 202527లో భాగంగా జరగనుంది. శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని భారత జట్టు ప్రస్తుతం పాయింట్ల పట్టికలో ఐదో స్థానంలో ఉంది. భారత్ ఇప్పటివరకు ఆడిన 9 మ్యాచ్‌లలో 4 విజయాలు, 4 ఓటములతో 48.150 పాయింట్ల శాతాన్ని కలిగి ఉంది.




# అమెరికాలో చరిత్ర

- సొంతంగా స్టేడియం నిర్మించిన నైట్ రైడర్స్ గ్రూప్!
- లాస్ ఏంజిల్స్‌లో అట్టహాసంగా మేజర్ లీగ్ క్రికెట్ సమరం







గ్లోబల్ క్రికెట్ చరిత్రలో షారుఖ్ ఖాన్‌కు చెందిన నైట్ రైడర్స్ గ్రూప్ ఒక అరుదైన మైలురాయిని అధిగమించింది. ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా ఒక గ్లోబల్ క్రికెట్ బ్రాండ్ సొంతంగా అంతర్జాతీయ క్రికెట్ మైదానాన్ని నిర్మించి చరిత్ర సృష్టించింది. లాస్ ఏంజిల్స్‌లో కొత్తగా నిర్మించిన 'నైట్ రైడర్స్ క్రికెట్ గ్రౌండ్' వేదికగా మేజర్ లీగ్ క్రికెట్ సరికొత్త సీజన్ మ్యాచ్‌లు ప్రారంభమయ్యాయి. ఈ సరికొత్త స్టేడియంలో లాస్ ఏంజిల్స్ నైట్ రైడర్స్, వాషింగ్టన్ ఫ్రీడమ్ జట్లు తలపడ్డాయి. అమెరికాలో క్రికెట్ క్రీడను శాశ్వతంగా బలోపేతం చేయాలనే సుదీర్ఘ లక్ష్యంతో నైట్ రైడర్స్ గ్రూప్ ఈ ప్రపంచ స్థాయి మౌలిక వసతులను కల్పించింది. ఐసీసీ ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించిన ఈ మైదానంలో ఎనిమిది ప్రధాన వికెట్లు, 120 అడుగుల ఎత్తున్న ఆరు ఫ్లడ్‌లైట్ టవర్లను ఏర్పాటు చేశారు.

**కల నిజమైందన్న బాద్షా షారుఖ్ ఖాన్**

ఈ చారిత్రాత్మక సందర్భంపై నైట్ రైడర్స్ గ్రూప్ సహ యజమాని షారుఖ్ ఖాన్ హర్షం వ్యక్తం చేశారు. ఒక చిన్న కలగా ప్రారంభమైన ఈ ప్రయాణం నేడు నిజమైన క్రీడా క్షేత్రంగా మారడం సంతోషంగా ఉందన్నారు. ప్రపంచంలోనే అత్యధికంగా వీక్షించే రెండో క్రీడ అయిన క్రికెట్‌ను లాస్ ఏంజిల్స్ నగరానికి తీసుకురావడం ఒక మైలురాయి అని ఆయన పేర్కొన్నారు. కేవలం ఆట కోసమే కాకుండా క్రీడాభిమానులు, కుటుంబాలు కలిసి ఆనందించేలా ఈ వేదికను తీర్చిదిద్దినట్లు చెప్పారు.




# ప్రతిభకు పరీక్ష

- సూర్యవంశీ ఎంట్రీపై కొనసాగుతున్న ఉత్కంఠ!
- బెంచ్‌కే పరిమితమైన 15 ఏళ్ల సంచలన బ్యాటర్

ఐపీఎల్ 2026 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున 776 పరుగులు చేసి సంచలనం సృష్టించిన బీహార్ యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ అరంగేట్రంపై తీవ్ర చర్చ నడుస్తోంది. ఐర్లాండ్ పర్యటనతో పాటు ప్రస్తుత ఇంగ్లాండ్ సిరీస్ జట్టులో చోటు దక్కించుకున్న ఈ 15 ఏళ్ల కుర్రాడు వరుసగా మూడు మ్యాచ్‌ల్లో కేవలం బెంచ్‌కే పరిమితమయ్యాడు. మరోవైపు వైభవ్ సూర్యవంశీని జట్టులోకి తీసుకోకపోవడంపై మాజీ క్రికెటర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. యువ ఆటగాడిని పరీక్షించడానికి ఇలాంటి ద్వైపాక్షిక సిరీస్‌లే సరైన సమయమని సునీల్ గవాస్కర్ అభిప్రాయపడ్డారు. అవకాశం ఆలస్యమయ్యే కొద్దీ ఆ కుర్రాడిపై ఒత్తిడి పెరుగుతుందని ఆయన హెచ్చరించారు. మాజీ కోచ్ రవిశాస్త్రి సైతం స్పందిస్తూ.. ఐర్లాండ్ లాంటి చిన్న మైదానాల్లో వైభవ్ ఆడి ఉంటే ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపించేవాడని, అతడికి వీలైనంత త్వరగా తుది జట్టులో అవకాశం కల్పించాలని గట్టిగా డిమాండ్ చేశారు. మేనేజ్‌మెంట్ నిర్ణయాలు, నిపుణుల అభిప్రాయాల మధ్య ఈ వివాదం ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.




# దసరాకు విశ్వంభర రిలీజ్

**సన్నాహాలు చేస్తోన్న చిత్రబృందం**

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ సోషియో`ఫాంటసీ అడ్వెంచర్ మూవీ 'విశ్వంభర' విడుదలపై ఎట్టకేలకు ఒక స్పష్టత వచ్చేసినట్లు తెలుస్తుంది. ఈ భారీ బ్జడెట్ విజువల్ వండర్ సినిమాను రాబోయే దసరా కానుకగా అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తుంది. చిరంజీవి ఎపిక్ ఫాంటసీ 'విశ్వంభర' దసరా పండుగ కానుకగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి వస్తోంది అంటూ పలువురుమీడియా, సినీ ప్రముఖులు సోషల్మీడియా వేదికగా పోస్ట్‌లు పెట్టడంతో దసరా రాబోతుండటం పక్కా అని తెలుస్తుంది. బ్లాక్‌బస్టర్ హిట్ 'బింబిసార' చిత్ర దర్శకుడు వశిష్ట ఈ సినిమాను ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తుండగా, ప్రముఖ నిర్మాణ సంస్థ యువి క్రియేషన్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు. గతంలోనే ఈ సినిమా షూటింగ్ పూర్తయినప్పటికీ, అత్యుత్తమ అవుట్‌పుట్ కోసం భారీ విజువల్ ఎఫెక్ట్స్ మరియు గ్రాఫిక్స్ పనులపై చిత్రయూనిట్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. 'అంజి', 'జగదేకవీరుడు అతిలోకసుందరి' చిత్రాల తర్వాత చిరంజీవి నుండి వస్తున్న పూర్తి స్థాయి సోషియో`ఫాంటసీ సినిమా కావడంతో ఈ దసరాకు బాక్సాఫీస్ వద్ద మెగాస్టార్ సరికొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని అభిమానులు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు.




# నేడు థియేటర్లలోకి నాగబంధం మూవీ

**హిందీ వర్షన్‌కు బై వన్ గెట్ 2 ఆఫర్**

పౌరాణిక అంశాలు, ఫాంటసీ అడ్వెంచర్, థ్రిల్లింగ్ కథాంశంతో తెరకెక్కిన 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర' సినిమా జులై 3న శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. దర్శకుడు అభిషేక్ నామా రూపొందించిన ఈ చిత్రంలో విరాట్ కర్ణ, నభా నటేష్, ఐశ్వర్యమీనన్ ప్రధాన పాత్రల్లో నటించారు. విడుదలకు ముందే ఈ సినిమాపై మంచి అంచనాలు ఏర్పడగా, ఇప్పుడు మేకర్స్ మరో ప్రత్యేక నిర్ణయంతో అందరి దృష్టిని ఆకర్షించారు. సినిమా విడుదల రోజునే ప్రేక్షకులను థియేటర్లకు ఆకర్షించేందుకు చిత్ర బృందం 'బై వన్ గెట్ వన' ఆఫర్‌ను ప్రకటించింది. ఒక టికెట్ కొనుగోలు చేస్తే మరో టికెట్ ఉచితంగా అందించే ఈ స్కీమ్‌ను తొలి రోజు నుంచే అమలు చేస్తున్నారు. ఇటీవల బాలీవుడ్ సినిమాల్లో ఇలాంటి ప్రమోషనల్ ఆఫర్లు ఎక్కువగా కనిపిస్తుండగా, ఇప్పుడు తెలుగు సినిమాల్లో కూడా ఈ తరహా మార్కెటింగ్ వ్యూహాలు చోటుచేసుకోవడం ఆసక్తికరంగా మారింది. అయితే, ఈ ఆఫర్ కేవలం హిందీ వెర్షన్‌కు మాత్రమే వర్తిస్తుందని చిత్ర బృందం స్పష్టం చేసింది. తెలుగు లేదా ఇతర భాషల వెర్షన్లకు ఈ సదుపాయం ఉండదు. 'నాగబంధం'ను



అత్యంత భారీ నిర్మాణ విలువలతో రూపొందించారు. పౌరాణిక కథాంశానికి ఆధునిక విజువల్ ఎఫెక్ట్స్‌ను జోడిస్తూ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించేలా సినిమాను తీర్చిదిద్దినట్లు మేకర్స్ చెబుతున్నారు. ఫాంటసీ ప్రపంచం, యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉండనున్నాయని ప్రచార చిత్రాలు సూచిస్తున్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్‌కు సోషల్ మీడియాలో మంచి స్పందన లభించింది. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, అడ్వెంచర్ అంశాలు సినిమాపై ఆసక్తిని మరింత పెంచాయి. ఈ చిత్రంలో సీనియర్ నటులు జగపతి బాబు, మహేష్ మంజ్రేకర్, మురళీ శర్మ, దక్ష నగర్కర్, రిషభ్ సాహ్నీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కథలో ప్రతి పాత్రకు ప్రత్యేక ప్రాధాన్యం ఉండేలా దర్శకుడు అభిషేక్ నామా రూపకల్పన చేసినట్లు తెలుస్తోంది. నాగబంధం' సినిమా కాదు... ఓ అనుభవం అన్నారు విరాట్ కర్ణ. ఆయన కథానాయకుడిగా... అభిషేక్ నామా దర్శకత్వంలో తెరకెక్కిన సినిమానే 'నాగబంధం'. ఓ నటుడిగా అందరి హృదయాల్లో స్థానం సంపాదించాలని ఈ సినిమా కోసం ప్రాణం పెట్టి పనిచేశా. ఇంత పెద్ద సినిమాలో నటించే అవకాశం ఇచ్చిన దర్శకుడికి రుణపడి ఉంటా. ఇందులో ప్రతిదీ ఓ అద్భుతంలా ఉంటుంది. మన భారతీయ సంస్కృతి, వారసత్వానికి జరిగే ఓ వేడుక లాంటి సినిమా ఇది అన్నారు. నిర్మాత డి.సురేశ్‌బాబు మాట్లాడుతూ అందరూ ప్రాణం పెట్టి చేసిన ఖరీదైన సినిమా ఇది. పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నా' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'మన సంస్కృతి, మన మూలాల్ని ఆవిష్కరిస్తూ, సనాతన ధర్మం గురించి గొప్ప సందేశమిస్తుందీ చిత్రం. ప్రేక్షకులకు ఓ ప్రత్యేకమైన అనుభవాన్ని పంచేలా భారీ హంగులతో తెరకెక్కించాం' అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ 'ప్రతి పది నిమిషాలకు ఓ కొత్త ప్రపంచాన్ని తెరపై ఆవిష్కరించే చిత్రమిది. విజువల్ వండర్‌గా అందరి హృదయాల్ని గెలుస్తుంది' అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్రబృందం పాల్గొంది.

# సెన్సార్ నుంచి బటయపడని జననాయగన్




కోలీవుడ్ స్టార్ హీరో దళపతి విజయ్ పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ 'జననాయగన' రిలీజ్ చుట్టూ ఇండస్ట్రీలో సరికొత్త చర్చ నడుస్తోంది. గత 7 నెలలుగా ఈ చిత్రం సెన్సార్ వివాదాలు, కోర్టు కేసుల కారణంగా వాయిదా పడుతూ వస్తున్న సంగతి తెలిసిందే. అయితే తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రం సెన్సార్ బోర్డు నుండి 'ఎ సర్టిఫికెట్ పొందే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వచ్చే వారం రోజుల్లోగా ఈ తుది సర్టిఫికేషన్ పక్రియ పూర్తి కానుందని ఆ వెంటనే హిందీ, తెలుగు వెర్షన్ల సెన్సార్ ఫార్మాలిటీస్‌ను కూడా పూర్తి చేసేందుకు చిత్ర యూనిట్ ప్లాన్ చేస్తోంది. సెన్సార్ సమస్యలు వీడుతుండటంతో మేకర్స్ ఈ సినిమాను జూలై 16లేదా జూలై 23న థియేటర్లలోకి తీసుకురావాలని భావిస్తున్నట్లు సమాచారం. అయితే, ఇప్పటికే ఈ విండోలో పలు క్రేజీ చిత్రాలు తమ విడుదల తేదీలను ప్రకటించాయి. జూలై 17న 'అన్వేడయానా', జూలై 23న 'మకుటం', 'ఇమ్మోర్టల', అలాగే జూలై 31న 'డిసి', 'సిగ్మా' వంటి చిత్రాలు లైన్లో ఉన్నాయి. ఇప్పుడు ఒకవేళ దళపతి విజయ్ రేసులోకి వస్తే ఇప్పటికే ప్రమోషన్లు మొదలుపెట్టిన ఆయా చిత్రాల కలెక్షన్లపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. అయితే సెన్సార్ ఎ సర్టిఫికెట్ ఇస్తే చిన్నపిల్లలు ఈ సినిమా చూసేందుకు అనుమతించరు. తమ హీరో సినిమాను కావాలనే ఇబ్బందులు పెడుతున్నారని ఫ్యాన్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కానీ దళపతి చివరి చిత్రం కావడంతో ఈ సినిమా ఎప్పుడు వచ్చినా థియేటర్ల వద్ద జాతర ఖాయమని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.



# 10న వస్తున్న అఖిల్ లెనిన్

**గ్యాప్ తరవాత విజయం కోసం ఎదురుచూపు**

'లెనిన'తో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యారు నటుడు అఖిల్. మురళీకిశోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా జులై 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాను మూడేళ్లు విరామం తీసుకోవడానికి గల కారణాన్ని అఖిల్ వివరించారు. ఏజెంట' సినిమా విడుదలైన మూడు నెలలకు నేను ప్రమాదవశాత్తు బాత్రూంలో పడ్డాను. గాజు ముక్కలు నా చేతికి బలంగా గుచ్చుకున్నాయి. ఎడమ చేతి వేళ్లకు రెండు శస్త్రచికిత్సలు జరిగాయి. 48 కుట్లు పడ్డాయి. 8 నెలల పాటు బరువులు ఎత్తలేకపోయాను. ఆ గాయం నుంచి పూర్తిగా కోలుకోవడానికి 16 నెలలు పట్టింది. మూడేళ్లు విరామం తీసుకున్నందుకు నా అభిమానులు నాపై కోపంగా ఉన్నారు. ఇలా మరోసారి జరగదని వాళ్లకు నేను హామీ ఇస్తున్నాను అని అఖిల్ చెప్పారు.`

This newspaper is Owned and Published by KANTIPUDI RAVENDRA from **H. NO. 319, 2ND FLOOR, BHAGATHSINGH NAGAR, PHASE 1, SARDAR PATEL NAGAR, NEAR SRADHA SCHOOL, VENKATESWARA SWAMY TEMPLE KPHB, KUKATPALLY, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500072.** Editor: KANTIPUDI RAVENDRA, Printed by BANDLA SAIBABU from PLOT NO. A-22/1, ROAD NO. 14, INDUSTRIAL PARK, NACHARAM, HYDERABAD, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500076. PRGI REGD No.: TGTEL/26/A4986. Phone: 9392666319. Email ID: prabhathakiranam@gmail.com.
Corporate Office: HIG 79, VNR RESIDANCY ,VENKATARAMANA COLONY, KUKATPALLY ,HYDERABAD, 500085